ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

ఆత్మవిశ్వాసం వల్ల కలిగే
ఆధ్యాత్మిక లాభాలు

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2026
ప్రతులు : 1,000

వెల : రూ. 60/-

పుస్తకముల కొరకు :-

తటవర్తి వీరరాఘవరావు,

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

1) మరోజన్మ	-	రూ.160/-
2) సాధనలో స్థితులు	-	రూ.80/-
3) జ్ఞానమాల	-	రూ.70/-
4) దత్తాత్రేయుని 24 మంది గురువులు	-	రూ.70/-
5) బుద్ధుని సూక్తులు	-	రూ.70/-
6) జీవిత పరమార్థం	-	రూ.70/-
7) అవిద్య అంటే?	-	రూ.70/-
8) బుద్ధుని పంచశీలాలు	-	రూ.70/-
9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం?	-	రూ.70/-
10) ఆత్మ పరిణామక్రమం	-	రూ.70/-
11) "అహం దేహోస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి	-	రూ.70/-
12) మనసుకు వున్న మూడు దోషాలు	-	రూ.60/-
13) గురుపౌర్ణమి విశిష్టత	-	రూ.60/-
14) మానవుడు యోగిగా ఎదగాలంటే?	-	రూ.60/-
15) ఏది సరైన సాధన?	-	రూ.60/-
16) పంచకోశాలు	-	రూ.60/-
17) మనస్సు యొక్క స్థితులు	-	రూ.60/-
18) ధార్మిక జీవితం అంటే?	-	రూ.60/-
19) జీవితం ధన్యం చేసుకోవాలంటే?	-	రూ.60/-
20) జన్మరాహిత్య స్థితికి మార్గం	-	రూ.60/-
21) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు	-	రూ.60/-
22) మాయకు వశమైనవాడి లక్షణాలు	-	రూ.60/-
23) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి?	-	రూ.60/-
24) మానవుని కర్తవ్యాలు	-	రూ.50/-
25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి?	-	రూ.50/-
26) చిత్తం శాంతిగా వుండాలంటే?	-	రూ.50/-
27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు	-	రూ.50/-
28) బాహ్య మౌనం - అంతర్ మౌనం	-	రూ.50/-
29) అహంకారం ఎలా పోతుంది	-	రూ.50/-
30) మానవుల్లో అసంతృప్తికి కారణం	-	రూ.50/-
31) ప్రీతి,భీతి, నీతి	-	రూ.40/-
32) జీవితంలో విజయం సాధించాలంటే?	-	రూ.40/-

ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి?

ఈ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న మీ అందరికీ "ఆత్మే దైవం" అనే సత్యం తెలుసు. అలాగే, మీలో ఆత్మగా ప్రకాశిస్తున్న పరమాత్మ చైతన్యమే ఈ సృష్టిలోని సమస్త జీవరాశులను నడిపిస్తున్నదని కూడా మీరు తెలుసుకున్నారు.

అయితే ఈ సత్యాన్ని తెలుసుకోవడం మాత్రమే సరిపోదు, తెలుసుకున్న జ్ఞానాన్ని జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే అది నిజమైన జ్ఞానంగా మారుతుంది. మరి ఈ సత్యాన్ని ఆచరణలో ఎవరు పెడతారు అంటే ఆత్మపై దృఢమైన విశ్వాసం ఉన్నవారే.

అందుకే ఈరోజు ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? అది మన జీవితాన్ని ఎలా మారుస్తుంది? అనే విషయాన్ని తెలుసు కుందాం. ఆత్మపై విశ్వాసం ఎందుకు ఉండాలి? ఎందుకంటే ఆత్మ అనేది పరమాత్మ స్వరూపం, అది అనంతమైన జ్ఞానం, అనంతమైన శక్తి, అనంతమైన ఆనందానికి మూలం అని ఎప్పుడైతే మీరు తెలుసుకుంటారో, అప్పుడే మీ ఆలోచనలు, మీ ప్రవర్తన, మీ జీవితం కూడా పూర్తిగా మారిపోతుంది.

అప్పటి వరకు "నేనే ఈ శరీరం" అనే దేహ భావంతో జీవించిన మీరు, జీవ భావంలోనే అహంకారం, మమకారం, కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం వంటి అరిషడ్వర్గాలకు లోబడి జీవిస్తారు. కానీ ఎప్పుడైతే "ఆత్మే నేను, ఆ ఆత్మే భగవంతుడు" అనే సత్యాన్ని తెలుసుకుంటారో, అప్పటి నుంచి మీ జీవన విధానం పూర్తిగా మారిపోతుంది.

మరి ఆత్మపై విశ్వాసం ఉంచినవారు ఎవరు అంటే జ్ఞానులే. జ్ఞానం పొందిన వారే ఆత్మను దైవంగా భావించి, ఆత్మపై విశ్వాసం ఉంచి తమ పనులన్నింటినీ చేస్తారు. అయితే, ఈ జ్ఞానం లేకుండా అజ్ఞానంలో ఉన్నవాడు

"నేనే శరీరం" అనే జీవ భావంతోనే జీవిస్తాడు.

అందుకే ఆత్మవిశ్వాసం ఉన్నవారు విమర్శలకు కృంగిపోరు, పొగడ్తలకు పొంగిపోరు. ఎవరైనా ప్రశంసించినా అహంకారానికి లోను కారు, ఎవరైనా విమర్శించినా మనశ్శాంతిని కోల్పోరు. మీరు గమనిస్తే, ఒక చెట్టుకు గాలి వీచినప్పుడు ఆకులు కదులుతాయి, కానీ ఆ చెట్టు మాను మాత్రం స్థిరంగానే ఉంటుంది, ఎంత గాలి వీచినా తన స్థిరత్వాన్ని కోల్పోదు. అలాగే ఆత్మవిశ్వాసం కలిగిన జ్ఞాని కూడా జీవితంలో ఎన్ని అనుకూల, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా చెట్టు మానులా స్థిరంగా ఉంటాడు. బాహ్య పరిస్థితులు అతనిని కదిలించలేవు, ఎందుకంటే అతను ఆత్మ స్థితిలో ఉంటాడు.

అందువల్ల అనుకూల పరిస్థితులు ఎదురైనా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆత్మవిశ్వాసం ఉన్నవారు చలించరని తెలుసుకోవాలి. అనుకూల పరిస్థితులు అంటే మీ చుట్టూ ఉన్న పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నప్పుడు వారు సంతోషంతో పొంగిపోరు. అలాగే ప్రతికూల పరిస్థితులు, అంటే వ్యతిరేకమైన పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా వారు కృంగిపోరు, నిరాశ చెందరు, "ఇలా ఎందుకు జరిగింది?", "నాకే ఎందుకు ఇలా జరిగింది?" అని బాధపడరు.

జ్ఞానం ఉన్నవారికి ఎలాంటి దుఃఖకరమైన సంఘటన జరిగినా, ఎంత బాధాకరమైన పరిస్థితి ఎదురైనా వారు కుంగిపోరు. ఎందుకంటే వారికి జీవితం వెనుక ఉన్న సత్యం, కర్మ సిద్ధాంతం, ప్రకృతి ధర్మం గురించి స్పష్టమైన అవగాహన ఉంటుంది. ఏది ఏ కర్మ ఫలితంగా జరుగుతుందో, ఏది భగవంతుని సంకల్పం వల్ల జరుగుతుందో, ఏది ప్రకృతి నియమం ప్రకారమే జరుగుతుందో వారు తెలుసుకుని ఉంటారు, అందుకే ప్రతి సంఘటనను ప్రశాంతంగా అంగీకరిస్తారు.

"ఇది ఎలా జరగాల్సి ఉందో అలా జరుగుతుంది, జరగవలసింది

ఎప్పటికైనా జరుగుతుంది" అని భావిస్తారు. కానీ "ఇలా ఎందుకు జరిగింది?", "నాకే ఎందుకు ఇలా జరిగింది?" అని చింతలో కూరుకుపోరు. ఎందుకంటే సర్వమూ ఆత్మమయమే అనే సత్యాన్ని వారు తెలుసుకున్నారు. అందువల్ల జరిగేది దైవ నియమం ప్రకారమే జరుగుతుందని అర్థం చేసుకుని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారు కృంగిపోరు.

చాలామందికి ఈ ఆత్మవిశ్వాసం ఎక్కడ లోపిస్తుందో గమనించాలి. మాటల్లో "నేను ఆత్మను" అని చెబుతారు, కానీ చిన్న బాధాకరమైన విషయం వచ్చినా కృంగిపోతారు, ఎవరైనా ప్రశంసించినా పొంగిపోతారు. ఈ రెండు పనులు ఆత్మవిశ్వాసం ఉన్నవారు చేయరు. దేహ భావంతో జీవించేవారు సంతోషం, దుఃఖమే నిజమని అనుకుంటూ ఉంటారు. కానీ ఆత్మ భావనలో, ఆత్మ స్థితిలో "నేను ఆత్మను" అని తెలుసుకున్నవాడు దేనికీ పొంగిపోడు, దేనికీ కృంగిపోడు, ఇదే జ్ఞాని యొక్క లక్షణం.

మీ జీవితంలో ఇలాంటి అనుకూల, ప్రతికూల సంఘటనలు ఎదురైనప్పుడు మీరు చలించినా, పొంగిపోయినా, కృంగిపోయినా, ఇంకా మీకు ఆత్మపై సంపూర్ణ విశ్వాసం రాలేదని, మీరు ఇంకా ఆత్మ భావంలో కాకుండా దేహ భావంలోనే జీవిస్తున్నారని అర్థం చేసుకోవాలి.

కానీ గురువు చెప్పిన జ్ఞానాన్ని అందరూ ఆచరణలో పెట్ట లేరు, ఎందుకంటే పవిత్రత లేని వారు ఆ జ్ఞానాన్ని గ్రహించినా, దానిని జీవితంలో ఆచరించలేరు. మాటల్లో, చేతల్లో, ఆలోచనల్లో ఎవరైతే పవిత్రతను పెంపొందించుకుంటారో, వారే గురువు బోధించిన జ్ఞానాన్ని తమ జీవితంలో ఆచరణలో పెట్టగలరు. అలాంటి వారిలో ఆత్మ శక్తి క్రమంగా పెరుగుతుంది, వారి మనసు శుద్ధమవుతుంది. అందువల్ల గురువు బోధించిన జ్ఞానం వారి జీవితంలో అనుభవంగా మారుతుంది.

అందుకే మహాత్ములు ఎప్పుడూ ఒక విషయాన్ని అంటే "పవిత్రమైన

ఆలోచనలు, పవిత్రమైన మాటలు, పవిత్రమైన ప్రవర్తన ఉన్న వారిలోనే ఆత్మ శక్తి ఎక్కువగా ఉంటుంది" అని బోధించారు.

వర్తమాన జీవితంలో, ముఖ్యంగా ఈ ఆధ్యాత్మిక మార్గంలో నడిచే ప్రతి ఒక్కరూ పవిత్రమైన జీవితం గడపాలి, ఎందుకంటే ఆధ్యాత్మిక పురోగతికి పునాది పవిత్రమైన ఆలోచనలు, సత్ప్రవర్తన, సత్శీలం. అందుకే మహాత్ములు, సద్గురువులు ప్రతి సందర్భంలో సత్ప్రవర్తన, సత్శీలం గురించి పదే పదే బోధిస్తూ ఉంటారు. ఎందుకు మళ్ళీ మళ్ళీ చెబుతారు అంటే, దైవ మార్గంలో ఉన్న మీరు కూడా కొన్నిసార్లు దేహాభిమానంతో, దేహంపై మమకారంతో, "దేహం బాగుండాలి, దేహానికి సుఖం కలగాలి" అనే భావంతో తెలియక కొన్ని తప్పులు చేస్తూ ఉండవచ్చు. అలా దేహ భావం పెరిగినప్పుడు సత్ప్రవర్తనలో లోపం వస్తుంది, సత్శీలం క్రమంగా తగ్గిపోతుంది.

అందుకే ఎప్పుడూ పవిత్రమైన ఆలోచనలే మిమ్మల్ని పరమాత్మ దగ్గరకు చేరుస్తాయని మహాత్ములు చెబుతుంటారు. కానీ పవిత్రమైన ఆలోచనలు, పవిత్రమైన లక్షణాలు, పవిత్రమైన ప్రవర్తన లేని వారు మళ్ళీ ప్రపంచ బంధాలలో చిక్కుకుపోతారు. దేహాభిమానం, కోరికలు, మమకారాలు, కర్మబంధాలకు లోనై జనన మరణ చక్రంలో తిరుగుతూనే ఉంటారు. ఎక్కడి నుంచి వచ్చారో, మళ్ళీ అక్కడికే వస్తూ సంసారచక్రంలోనే చిక్కుకు పోతారు. అందుకే మహాత్ములు పదే పదే చెబుతుంటారు "పవిత్రమైన ఆలోచనలు, పవిత్రమైన ప్రవర్తన, పవిత్రమైన జీవన విధానం ఉన్న వారికి ఈశ్వరానుగ్రహం లభిస్తుంది" అని.

చాలామందికి ఒక సందేహం, ఒక నిస్పృహ ఉంటుంది. "నేను ఆత్మని అని తెలుసుకున్నాను, కానీ నాకు ఇంకా ఆత్మ దర్శనం కలగలేదు, ఇంకా ఎన్ని రోజులు సాధన చేయాలి?" అని ఆలోచిస్తూ ఉంటారు. ఎందుకంటే చాలామంది సాధన చేసే సమయంలో మాత్రమే ఆత్మ భావంలో ఉంటారు, మిగతా సమయంలో మాత్రం బాహ్య ప్రపంచంలోనే జీవిస్తూ, దేహ భావంతోనే

ప్రవర్తిస్తుంటారు. అందువల్ల మనస్సు మళ్ళీ ప్రపంచం వైపే పరుగెత్తుతుంది, అలాంటి స్థితిలో ఆత్మ దర్శనం సులభంగా కలగదు. మీరు ప్రతి క్షణం "నేను ఆత్మను" అనే భావంలో ఉంటూ ఆత్మలాగా ఆలోచిస్తూ, ఆత్మలాగా ప్రవర్తించినప్పుడే భగవంతుని అనుగ్రహం మీకు కలుగుతుంది, ఆ దైవానుగ్రహమే మిమ్మల్ని ఆత్మ దర్శనం వైపు నడిపిస్తుంది. మరి భగవంతుని చేరుకోవాలంటే ఎలా జీవించాలి? భగవంతుని స్వభావాన్ని మీ జీవితంలో ప్రతిబింబింపజేయాలి. దానికి అవసరమైనవి పవిత్రమైన జీవితం, పవిత్రమైన జీవన విధానం, సత్ప్రవర్తన, సత్శీలం. ఇవే భగవంతుని చేరుకోవడానికి మార్గాలు.

మన పూర్వీకులకు, మహాత్ములకు, ఋషులకు ఆత్మ దర్శనం కలిగినప్పుడు, మీకు ఎందుకు కలగదు? అనే ప్రశ్నను ప్రతి సాధకుడు తనను తాను ప్రశ్నించుకోవాలి. దీనికి కారణం సాధనలో లోపం కాదు, మీ ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో ఉన్న లోపాలే. ఒక వైపు మీరు సాధన చేస్తూ, గత కర్మల ప్రభావాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు, కానీ మరో వైపు ఆలోచనల్లో, ప్రవర్తనలో, వ్యవహారంలో తెలియక కొత్త కర్మలను పోగు చేసుకుంటూ ఉంటారు. అందుకే సాధన చేయడమే కాదు, కొత్త కర్మలు పోగు కాకుండా జీవించడం కూడా అంతే ముఖ్యమని తెలుసుకోవాలి. గురువు ఇచ్చిన సాధనలో ఎప్పుడూ తప్పు ఉండదు, గురువు బోధించిన జ్ఞానంలో కూడా ఎలాంటి లోపం ఉండదు. ఎందుకంటే గురువు సత్యాన్నే బోధిస్తాడు, సరైన మార్గాన్నే చూపిస్తాడు, శిష్యుడు ఆ జ్ఞానం సరిగా అర్థం చేసుకోలేక పోవడం, లేదా అర్థం చేసుకున్నా దానిని ఆచరణలో పెట్టలేకపోవడమే అసలు కారణం.

కొన్నాళ్లు ఒక చోట ధ్యానం చేసి, "ఇక్కడ బాగుంది" అని, మరికొన్ని రోజులు ఇంకో చోటికి వెళ్ళి, మళ్ళీ మరో మార్గాన్ని వెతుకుతూ చివరకు

“ఎక్కడా ఏమీ దొరకడం లేదు” అని నిస్పృహ చెందడం కంటే, సద్గురువు ఏ సాధనను ఇచ్చాడో, ఏ జ్ఞానాన్ని బోధించాడో దానిపైనే విశ్వాసంతో నిరంతరం ఆచరించాలి. గురువును మార్చడం వల్ల కాదు, మిమ్మల్ని మీరు మార్చుకోవడం వల్లే ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది.

మీ గుణాలను కాపాడుకుంటూ సత్ప్రవర్తనతో జీవించినవాడికి బ్రహ్మానుభవం పొందడం చాలా సులభమవుతుంది. అందుకే ముందుగా మీ గుణం సత్వగుణంలోకి రావాలి, అప్పుడే సాధన సరిగ్గా సాగుతుంది. అంతేకాదు, వచ్చిన సత్వగుణాన్ని కూడా ఎల్లప్పుడూ కాపాడుకోవాలి. ఎందుకంటే కొన్నిసార్లు తినే ఆహారం అపవిత్రంగా ఉండడం వల్ల, చూసే దృశ్యాలు, వినే విషయాలు, కలిసే సాంగత్యం, ఆలోచించే విధానం వల్ల కూడా సత్వగుణం క్రమంగా తగ్గి రజోగుణం లేదా తమోగుణం ఆవరించవచ్చు.

చాలామంది “ఒక్కసారి తింటే తప్పేంటి?”, “ఒక్కసారి చూస్తే తప్పేంటి?”, “ఒక్కసారి చేస్తే ఏమవుతుంది?” అని అనుకుంటారు. కానీ ఆ ఒక్క సారే మీ గుణాలను దిగ జార్చి, సాధనలో వచ్చిన పురోగతిని వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది.

అందుకే మీ గుణాలు తప్పుడు మార్గంలోకి దిగజారకుండా ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. సత్వగుణాన్ని కాపాడుకోవడమే కాదు, దానిని మరింత పరిశుద్ధం చేసుకుంటూ శుద్ధ సాత్విక స్థితికి, అక్కడి నుంచి నిర్గుణ స్థితికి ఎదగడానికి నిరంతరం ప్రయత్నించాలి. ఎందుకంటే గుణాలలో వచ్చిన చిన్న మార్పే మీ జీవితాన్ని మార్చేస్తుంది. రజోగుణం, తమోగుణం క్రమంగా మిమ్మల్ని దేహాభిమానం, కోరికలు, ప్రపంచ వ్యామోహం వైపు లాగుతాయి. కానీ సత్వగుణం, శుద్ధ సాత్విక స్థితి, నిర్గుణ స్థితి మిమ్మల్ని పరమాత్మ వైపు తీసుకెళ్తాయి. అజ్ఞానికి జ్ఞాన బోధ వినిపించినా అర్థం కాదు. కానీ జ్ఞాని మాత్రం ఒక్క మాట విన్నా దాని వెనుక ఉన్న పరమార్థాన్ని, అంతరార్థాన్ని

కూడా గ్రహించగలడు.

ఉదాహరణకు, చీకటిలో ఉన్నవాడికి ఏదీ స్పష్టంగా కనిపించదు. కానీ వెలుతురులో ఉన్నవాడికి నేలపై పడిన చిన్న సూది కూడా సులభంగా తీసుకోగలుగుతాడు. అలాగే అజ్ఞానంలో ఉన్నవారికి ఏ విషయమూ పూర్తిగా అర్థం కాదు, కానీ జ్ఞానంలోకి వచ్చిన తర్వాత ప్రతి విషయానికి అర్థమే కాదు, అంతరార్థాన్ని కూడా గ్రహించే శక్తి కలుగుతుంది. అందుకే ధ్యానం, గురు బోధ, నిరంతర సాధన ద్వారా మీ సత్వగుణాన్ని క్రమంగా శుద్ధ సాత్విక స్థితికి తీసుకువెళ్లాలి, అక్కడి నుంచి నిర్గుణ స్థితిని చేరుకోవడానికి ప్రయత్నించాలి.

ఆ నిర్గుణ స్థితిని చేరుకున్నవారు దైవస్వరూపులుగా ఎదుగుతారు. అయితే ఈ మార్గంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి, ఎందుకంటే మనిషి పతనానికి అన్ని ఇంద్రియాలు అవసరం లేదు, ఒక్క ఇంద్రియమే చాలు. ఒక ఇంద్రియం నియంత్రణ కోల్పోతే అది క్రమంగా మిగిలిన ఇంద్రియాలను కూడా తన వెంట లాగి, మనస్సును కలుషితం చేసి, సాధనలో వచ్చిన పురోగతిని వెనక్కి నెడుతుంది.

మీరు గమనిస్తే, చూడకూడని వాటిని చూసినప్పుడు కళ్ళ ద్వారా చెడు సంస్కారాలు మనస్సులోకి ప్రవేశిస్తాయి. అలాగే వినకూడని విషయాలను విన్నప్పుడు చెవుల ద్వారా మనస్సు కలుషితమవుతుంది. మాటలు కూడా అంతే, చేతలు కూడా అంతే, ఒక చెడు ఆలోచన, ఒక చెడు దృశ్యం, ఒక చెడు మాట, ఒక చెడు అలవాటు క్రమంగా మన గుణాలను మార్చేస్తాయి. అందుకే మహాత్ములు ఒక గొప్ప సత్యాన్ని చెప్పారు మనిషి పతనానికి అన్ని ఇంద్రియాలు కారణం కావాల్సిన అవసరం లేదు; ఒక్క ఇంద్రియమే చాలు. ఒక ఇంద్రియం అదుపు తప్పితే అది మిగిలిన ఇంద్రియాలను కూడా తన వెంట లాగి, మనస్సును కలుషితం చేసి, సాధనలో వచ్చిన పురోగతిని వెనక్కి

నెడుతుంది.

అలాగే జ్ఞానం పొందాలంటే మంత్రాలు జపించడం వల్ల కానీ, యజ్ఞయాగాదులు చేయడం వల్ల కానీ, తీర్థ యాత్రలు చేయడం వల్ల కానీ, పూజలు, వ్రతాలు, కర్మకాండలు చేయడం వల్ల కానీ ఎవరూ ఆత్మ జ్ఞానులు కాలేరు. కానీ ఆత్మజ్ఞానం, మోక్షం మాత్రం గురు బోధను గ్రహించి ఆచరణలో పెట్టినప్పుడే లభిస్తాయి. మీ జీవితంలో ఒక సద్గురు వచ్చినప్పుడు,ఆయన చెప్పిన జ్ఞానాన్ని శ్రద్ధగా గ్రహించి, అదే విధంగా జీవితంలో ఆచరించిన వాడే నిజమైన జ్ఞానాన్ని పొందగలడు. అంతేకాదు, గురువు మీకు ఏ సాధనను, ఏ జ్ఞానాన్ని ప్రసాదించాడో, అదే సాధన కొనసాగాలి.

శిష్యుడు ఎంత గొప్పవాడైతే, అంత గొప్ప గురువు అతనికి లభిస్తాడు. ఎందుకంటే సృష్టిలో గురువును పొందడానికి శిష్యుడికి కూడా అర్హత ఉండాలి. దైవాన్ని చూపించే మార్గాన్ని బోధించగలిగే సద్గురువు మీ జీవితంలోకి రావాలంటే, ముందుగా మీరు ఆ అర్హతను సంపాదించుకోవాలి. ఆ అర్హత పూర్వ జన్మ పుణ్యంతో, సత్కర్మల ఫలితంతో, సేవాభావంతో, దానగుణంతో, వినయంతో, పవిత్రమైన జీవన విధానంతో ఏర్పడుతుంది. ఎవరైతే నిస్వార్థ సేవ చేస్తారో, ఇవ్వడంలో ఆనందాన్ని పొందుతారో, మంచి గుణాలను పెంపొందించుకుంటారో, వారే సద్గురువు కృపకు పాత్రులవుతారు. అందుకే మీకు ఎలాంటి గురువు లభిస్తాడో అది మీ ఆలోచనలను బట్టి, మీ ప్రవర్తనను బట్టి, మీలో ఉన్న గుణాలను బట్టి నిర్ణయించబడుతుంది. ఇప్పుడు చూడండి, జ్ఞానాన్ని పొందడానికి ఎన్నో మార్గాలు, ఎన్నో సాధనా పద్ధతులు ఉన్నాయి. అయితే వాటన్నింటిలో “శ్వాస మీద ధ్యాస”యే సరైన మార్గం అని చెప్పినప్పుడు మీరు ఎందుకు నమ్మారు? ఎందుకంటే ఎంతో విచారణ చేశారు.

అసలు శ్వాస అంటే ఏమిటి? “శ్వాస మీద ధ్యాస” ఎందుకు పెట్టాలి? శ్వాసకు మనస్సుతో ఉన్న సంబంధం ఏమిటి? అని లోతుగా విచారణ

చేసినప్పుడు సత్యం అర్థమవుతుంది. బాహ్యంగా రూపాలను ఆరాధించడం వల్ల కానీ, నామస్మరణ చేయడం వల్ల కానీ, మంత్ర జపాలు చేయడం వల్ల కానీ ఆత్మజ్ఞానం కలగదు.

కొందరు మంత్రోపదేశం చేస్తారు, మరికొందరు ఓంకార సాధనను బోధిస్తారు. ఉపనిషత్తులు కూడా కొన్ని సందర్భాల్లో ఓంకారాన్ని ధ్యానించమని ఉపదేశిస్తాయి. అయితే గురువుగారు ఒక విషయాన్ని చెప్పారు ఈ కలియుగంలో అత్యంత సులభంగా, మనస్సును నిశ్చలపరచగల సాధన “శ్వాస మీద ధ్యాస” అని స్పష్టంగా బోధించారు.

ఓంకార జపంలో కూడా మీరు నిరంతరం జపం చేస్తూ ఉంటే, మంత్రాన్ని పదే పదే ఉచ్చరిస్తూ ఉంటే, మీరు మనస్సు స్థాయిలోనే ఆగిపోతారు. అక్కడి నుంచి బయటపడటానికి ఈ కాలంలో అనుకూల పరిస్థితులు లేవు. ఇప్పుడు కూడా చాలామంది జపం చేస్తూ ఉంటారు, కానీ వారు శూన్య స్థితిలోకి వెళ్తున్నారా? లేదు. జపమాలను తిప్పుకుంటూ, బాహ్య ప్రపంచంలోనే ఉంటూ, నోటితో మంత్రం జపిస్తూ, మనస్సుతో ఆలోచిస్తూ, కళ్ళతో చూస్తూ, చెవులతో వింటూ ఉంటారు. అంటే ఈ కలియుగంలో మానవుడు జపం ద్వారా మోక్షాన్ని సాధించలేడని పత్రీజీ తెలుసుకున్నారు.

అందుకే ఆయన స్పష్టంగా చెప్పారు బయట కళ్ళను తెరిచి ఉండటం ధ్యానం కాదు, కళ్ళను మూసుకుని అంతర్ముఖులై మీలోకి ప్రయాణించడం నిజమైన ధ్యానం. మీరు కళ్ళను మూసుకుని మీ అంతరంలోకి వెళ్ళినప్పుడే ఇంద్రియాలన్నింటినీ నిశ్శబ్దంలో ఉంచగలుగుతారు ఆ నిశ్శబ్ద స్థితికి మిమ్మల్ని తీసుకెళ్ళగలిగేది మీ శ్వాస మాత్రమే. మీ శ్వాసే మిమ్మల్ని వర్తమాన లో నిలబెడుతుంది, మీ శ్వాసే మీ మనస్సును ప్రశాంతపరుస్తుంది, మీ శ్వాసే మీ చంచలమైన మనస్సును నియంత్రించగలదు.

ఈ విషయాన్ని పత్రి గారు ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం

చేసి, ఎందరో మహాత్ముల బోధనలను పరిశీలించి మనసు దేనికి లొంగుతుందో గ్రహించారు. ఎందుకంటే ఆయన ఎన్నో గ్రంథాలను చదివి, లోతుగా పరిశీలించి, మనస్సు పూర్తిగా లొంగేది శ్వాసకే అని గ్రహించారు. ఇదే సత్యాన్ని శ్రీకృష్ణ భగవానుడు ఉత్తర గీతలో కూడా బోధించారు. ధ్యానంలో మానవుడికి ప్రధానమైన అడ్డంకి మనస్సేనని లోతుగా గ్రహించిన బ్రహ్మర్షి పత్రీజీ, ఆ చంచలమైన మనస్సును నియంత్రించ గల శక్తి ఒక్క శ్వాసకే ఉందని తెలుసుకున్నారు. అందుకే ఆయన "శ్వాస మీద ధ్యాస" అనే అత్యంత సహజమైన ధ్యాన విధానాన్ని ప్రపంచానికి అందించారు.

ఆయన స్పష్టంగా చెప్పారు" ఎన్నో ధ్యాన పద్ధతులను నేను స్వయంగా ఆచరించాను. ఈ కలియుగంలో మానవుడు తరించడానికి బయట నుంచి గురువు ఇచ్చే మంత్రం కూడా అవసరం లేదు. తన శ్వాసనే తన గురువుగా ఎన్నుకుంటే, అదే తన మనస్సును నియంత్రిస్తుంది, మనస్సు ఎప్పుడైతే నియంత్రణలోకి వస్తుందో, దాని వెనుక దాగి ఉన్న ఆత్మ దర్శనం కలుగుతుంది" అని.

గురువు ఈ మాట ఎందుకు చెప్పారు? ఎందుకంటే ఆత్మే దైవం అని విశ్వసించినవాడు, బయట ఎక్కడో భగవంతుణ్ని వెతకకుండా, తనకు అత్యంత సమీపంలో, తనలోనే ప్రకాశిస్తున్న ఆత్మను దర్శించాలి. ఆత్మ దర్శనమే మానవ జన్మ యొక్క పరమ లక్ష్యం. అయితే ఆ ఆత్మ దర్శనం కలగాలంటే కేవలం ధ్యానం ఒక్కటే సరిపోదు, దానికి పునాదిగా సత్ప్రవర్తన మరియు సత్శీలం తప్పనిసరిగా ఉండాలి. సత్ప్రవర్తన అంటే ప్రతి జీవిలో ఉన్న ఆత్మను గౌరవించడం, ఏ జీవినీ హింసించకుండా, ఏ జీవికీ హాని కలిగించకుండా జీవించడం. ఎంతో గొప్పగా, ఎంతో సరళంగా ఒక్క మాటలో చెప్పారు "మీరు పాప కర్మ చేస్తే పరమాత్మకు దూరమవుతారు. నిష్కామకర్మ చేస్తే పరమాత్మకు దగ్గరవుతారు" అని. ఎందుకంటే స్వార్థంతో చేసిన ప్రతి కర్మ మనలను

బంధిస్తుంది, నిష్కామభావంతో చేసిన ప్రతి కర్మ మనలను పరమాత్మకు చేరువ చేస్తుంది.

ఆత్మే భగవంతుడు, సర్వత్రా ఉన్నది ఆత్మే అని చెబుతూ, ఆత్మ దర్శనం కలిగినవాడికే మోక్షం లభిస్తుందని బోధించారు. మోక్షం పొందిన వాడే నిజమైన ఆనంద స్థితిలో ఉంటాడు. నిత్యం ఈ ఇహ లోకంలోనే ఆనందంగా జీవిస్తూ, పర లోక ఆనందాన్ని కూడా పొందగలుగుతాడు. ఇహ లోకంలోనూ, పర లోకంలోనూ ఆనందాన్ని పొందాలనే మోక్షాపేక్ష ఉన్నవాడు ముందుగా ఆత్మపై విశ్వాసం పెంచుకోవాలి. "నేను ఆత్మను" అనే భావనను ఎల్లప్పుడూ ముందుకు తీసుకురావాలి. సర్వత్రా ఉన్నది ఆత్మే అని విశ్వసించినవాడు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంటాడు. ఎందుకంటే ఆత్మవిశ్వాసం ఉన్నవాడు ప్రతి క్షణం "నేను ఆత్మను" అనే భావనలోనే జీవిస్తాడు.

ఈ సత్యం తెలియని వారు "నేనే దేహం" అని భావిస్తారు. అలాంటి వారికి అహంకారం, మమకారం ఎప్పటికీ విడిచి పోవు. "నేనే దేహం" అనే భావం వచ్చినప్పుడు "నేను" అనే అహంకారం, "నాది" అనే మమకారం వస్తుంది. ఈ రెండూ మీలో వ్యాపించినప్పుడు ఆత్మను విశ్వసించరు, ఆత్మను విస్మరిస్తారు. విశ్వాసం ఉంటే ఊర్ధ్వ గతికి వెళ్తారు, విస్మరించడం అంటే వదిలేయడం. ఆత్మను విస్మరిస్తే మళ్ళీ భూలోకానికే తిరిగి వస్తారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుని, ఆత్మ దర్శనం కోసమే సాధన చేస్తూ, జ్ఞానాన్ని పెంచుకున్నవాడు ఉన్నత లోకాలకు చేరుకుంటాడు. లోకాలను దాటి చివరకు సత్యలోకాన్ని చేరుకునే అవకాశం పొందుతాడు. అందుకే భూమిపై ఉన్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే "నేను దేహం కాదు, నేను ఆత్మను." "నేను ఆత్మనే అయినా, ఆత్మను దర్శించ లేకపోతున్నాను" అంటే దానికి కారణం మీ మనస్సే, మీ మనస్సు అపవిత్రంగా ఉండటం వల్లే మీరు ఆత్మ దర్శనం చేసుకోలేకపోతున్నారు.

సాధన వల్ల ఈ అపవిత్రమైన మనస్సు పవిత్రమవుతుంది. ఆత్మ దర్శనం పొందినప్పుడే మోక్షం లభిస్తుంది, ఆ మోక్షాన్ని పొందాలనే ఆకాంక్ష మీలో ఉండాలి. మీ ప్రవర్తనను సత్ప్రవర్తనగా మార్చుకున్నప్పుడే మీరు పరమాత్మకు దగ్గరవుతారు. ఈ భూమిపై ఉన్నప్పుడే అంతటి సాధనను, అంతటి జ్ఞానాన్ని సంపాదించాలి, దానికి గురువు ఇచ్చిన సాధనను ఆచరించాలి. గురువు చెప్పిన జ్ఞానాన్ని అనుభవంలోకి తీసుకురావాలి. ఎప్పుడైతే మీరు ఆ జ్ఞానాన్ని అనుభవంలోకి తీసుకువచ్చే విధంగా జీవిస్తారో, అప్పుడే ఫలితం కనిపిస్తుంది. మీరు గమనిస్తే, ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు దానికి ఆటంకాలు వస్తే ముందుగా ఆ ఆటంకాలను తొలగించుకుని ఆ పనిని ప్రారంభిస్తారు.

అలాగే ఈ మోక్షమార్గంలోని ప్రయాణంలో కూడా మీకు పెద్ద ఆటంకాలు రెండు, 1.ఆహారం మరియు 2. వ్యవహారం. ఈ రెండింటినీ సరిచేసుకోవాలి, శాకాహారం తీసుకుంటూ, మీ గుణాలను కాపాడుకుంటూ, సత్వగుణంలో నిలకడగా ఉండాలి. ఒకసారి సత్వగుణంలోకి వచ్చిన తర్వాత మళ్ళీ రజోగుణం, తమోగుణం మిమ్మల్ని ఆవరించకుండా జాగ్రత్తపడాలి. ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు విచారణ చేసుకుంటూ, ఆత్మపై విశ్వాసాన్ని పెంచుకోవాలి. “నేను వెనక్కి వెళ్ళకూడదు, నా ఈ ప్రయాణంలో పురోగమనమే ఉండాలి, తిరోగమనం ఉండకూడదు, నన్ను నేను ఉద్ధరించుకోవాలి” అనే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి.

గురువు వచ్చి మార్గాన్ని చూపిస్తాడు, సత్యాన్ని బోధిస్తాడు. కానీ దానిని ఆచరణలో పెట్టుకోవాల్సింది మాత్రం శిష్యుడే. ఆత్మపై విశ్వాసం, భగవంతుడిపై విశ్వాసం, గురువుపై విశ్వాసం ఉన్నవాడే ఉన్నత స్థితికి చేరుకుంటాడు. భగవంతుడిపై, గురువుపై, ఆత్మపై విశ్వాసం లేనివాడు ప్రపంచమంతా తిరిగినా శాంతిని పొందలేడు. తన లోనే శాంతి లేనప్పుడు

చుట్టుపక్కల వారికి కూడా శాంతిని ఇవ్వలేదు. అందుకే భగవంతుడిపై విశ్వాసం, గురువుపై విశ్వాసం, ఆత్మపై విశ్వాసం ఉన్నవాడే మోక్షాన్ని పొందగలడు. ఆత్మపై విశ్వాసం ఎందుకు ఉండాలి? ఎందుకంటే గురువు "ఆత్మే దైవం" అని చెప్పారు, ఆ దైవమే నన్ను చివరి గమ్యం వరకు తీసుకెళ్ళే శక్తిని ప్రసాదిస్తోంది అని మీరు విశ్వసించినప్పుడు, మీరు చక్కగా సాధన చేస్తారు, జ్ఞానాన్ని పెంచుకుంటారు, సత్ప్రవర్తనతో జీవిస్తారు, సత్శీలాన్ని పెంపొందించుకుంటారు.

ఇలా ఎందుకు జీవించాలి అంటే, మోక్షాన్ని పొందాలంటే ఆత్మ ద్వారానే పొందగలుగుతారు. అందుకే గురువు ఇచ్చిన సాధనను చేస్తూ, గురువు ఇచ్చిన జ్ఞానాన్ని మననం చేస్తూ, ఈ దేహం ఉండగానే మీరు ఆత్మ జ్ఞానులుగా, బ్రహ్మ జ్ఞానులుగా మారాలి. దానికి మీ గుణాలను మార్చుకుని సత్వగుణంలోకి రావాలి. గురువు ప్రసాదించిన అనంతమైన జ్ఞానాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ, ఆచరణలో పెట్టుకుంటూ ఉండాలి.

సత్యలోకాన్ని చేరుకోవడానికి ఈ భూమిపై ఉన్నప్పుడే ప్రయత్నం చేయాలి. "నేను ఈ జన్మలోనే సాధించగలను" అనే విశ్వాసం ఉంటేనే సాధించడానికి ప్రయత్నిస్తారు. అందుకే మొదట మీరు ఉంచుకోవాల్సింది ఆత్మపై విశ్వాసం. ఆత్మే భగవంతుడు అని విశ్వసించాలి. ఆత్మే భగవంతుడు అని తెలియని వారే నాస్తికులు, ఆత్మే భగవంతుడు అని తెలుసుకున్న వారే ఆస్తికులు. ఆస్తి అంటే ఉన్నది, ఉన్నదంతా ఆత్మే అని తెలుసుకోవడమే మానవుని కర్తవ్యం. అందుకే మీరు ఈ మార్గంలోకి వచ్చారు. ఈ విషయాలన్నీ తెలుసుకుంటూ, ఆచరిస్తూ ఉంటే ఇంకా ఇంకా ఉన్నత స్థితికి ఎదగగలుగుతారు.

ఆత్మ దర్శనం పొందాలంటే?

ఆత్మ దర్శనం పొందాలంటే, పరమాత్మను చేరుకోవాలంటే, ఈ ప్రాపంచిక జీవితంలో మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలా ప్రవర్తించాలి? అనే కొన్ని ముఖ్యమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఈ మానవ జీవితంలోకి వచ్చిన తర్వాత, ఎందరో మహాత్ములు తమ అనుభవంతో కాచి వడ పోసి మనకు అందించిన అమూల్యమైన జ్ఞానాన్ని మీరు స్వీకరించాలి.

పత్రి గారు ఎప్పుడూ ఒక ఉపమానం చెప్పేవారు "తేనెటీగ అన్ని పువ్వుల మీద వాలి మకరందాన్ని సేకరించి, దానిని తేనెగా మార్చి ప్రపంచానికి అందిస్తుంది. అందుకే మీరు తేనెటీగలా జీవించాలి కానీ ఈగలా ఎప్పుడూ జీవించకూడదు" అని చెప్పేవారు. ఈగ మంచి వాటిపైన కూడా వాలుతుంది, కుళ్ళిన వాటిపైన కూడా వాలుతుంది. కానీ అది ఎవరికీ ఉపయోగపడదు. అందుకే అజ్ఞాని ఈగలాంటి వాడు, జ్ఞాని మాత్రం తేనెటీగలాంటి వాడు. జ్ఞాని అందరి దగ్గర ఉన్న జ్ఞానాన్ని స్వీకరిస్తాడు, దానిని తన అనుభవంలోకి తీసుకొస్తాడు. ఆ తర్వాత తాను పొందిన జ్ఞానాన్ని మరో పది మందికి పంచిపెడతాడు. అప్పుడే అతని జీవితం తేనెటీగ జీవితంలా సార్థకమవుతుంది. పత్రీ గారు ప్రత్యేకంగా, "మీరు కూడా తేనెటీగలా ఉండాలి" అని చెప్పేవారు.

ఆ మాటలు నాలో ఎంతో లోతుగా నాటుకు పోయాయి. ఇంతకు ముందు ప్రాపంచిక జీవితంలో కూడా సేవ చేస్తూ, పది మందికి ఉపయోగ పడుతున్నాను అనే తృప్తితో జీవించేదాన్ని. కానీ ఆధ్యాత్మిక జీవితంలో నిజమైన తృప్తి ఎప్పుడు కలుగుతుంది అంటే, సరైన సద్గురువు లభించి, ఆయన సరైన జ్ఞానాన్ని అందించి, మీ జీవిత లక్ష్యాన్ని, గమ్యాన్ని తెలియజేసినప్పుడు, మీరు ఆ మార్గంలో నడవడం ప్రారంభించినప్పుడే కలుగుతుంది.

ఒక విషయం గమనించండి మీరు సాధన చేసి జ్ఞానాన్ని పొందినా, దానిని ఎవరికీ పంచకుండా మీలోనే ఉంచుకుంటే, లోపల ఒక అసంతృప్తి మిగిలిపోతుంది. అదే జ్ఞానాన్ని మరో పది మందికి పంచినప్పుడు చెప్పలేని ఆనందం కలుగుతుంది. అందుకే దుఃఖంతో నిండిపోయిన మనిషి విశ్వానికి పెద్దగా ఏమీ ఇవ్వలేడు. కానీ ఆనందంతో నిండిన మనిషి మాత్రం విశ్వానికి ఎంతో గొప్ప సేవ చేయగలడు. ఈ సేవా మార్గంలో కొనసాగాలంటే, మీ అంతరంగంలో ఆనందం ఉండాలి. ఆ ఆనందాన్ని సద్గురువే మీలో మేల్కొలుపుతారు. "మీరు ఆనందస్వరూపులే. కానీ ఈ శరీరం, ఈ ప్రపంచమే శాశ్వతమని భావించి, శాశ్వతం కాని వస్తువుల వెనుక పరుగెత్తడం వల్లే మీ ఆనందం దుఃఖంగా మారుతోంది" అని గురువులు మనకు బోధిస్తారు.

అందుకే వారు మీకు సాధనను నేర్పించారు. జ్ఞానాన్ని ప్రసాదించారు. ఆ సాధన ఫలించాలని, ఆ జ్ఞానం జీవితంలో వికసించాలని ఉంటే, ముందుగా మీరు మీ గుణాన్ని ఎల్లప్పుడూ సత్వగుణంలో నిలుపుకోవాలి. మీరు సత్వ గుణంలో ఉన్నప్పుడు క్రమంగా సత్యానికి చేరువవుతారు. సత్యమే భగవంతుడు అని మీరు ఎన్నో సార్లు తెలుసుకున్నారు. ఆ భగవంతుని చేరుకునే విధానాన్ని తెలుసుకుని, దానిని ఆచరణలో పెట్టే గుణమే సత్వగుణం. ఈ సత్వగుణం మీలో పెరగాలంటే, మొదట మీరు ఆహార నియమాలను పాటించాలి. అందుకే పూర్వం పెద్దలు పండుగల రోజుల్లో, పూజల సమయంలో, ఉపవాస దినాల్లో సాత్వికమైన ఆహారాన్నే తీసుకోవాలని నేర్పించారు.

పూజ అయినా, ధ్యానం అయినా, ఏ ఆధ్యాత్మిక సాధన అయినా, మీరు సాత్విక గుణాన్ని పెంపొందించే ఆహారాన్ని తీసుకున్నప్పుడు మీ మనస్సు సహజంగానే భగవంతుని వైపు మళ్ళుతుంది. ఆయనను తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది. ఆధ్యాత్మిక సాధన పట్ల అభిరుచి ఏర్పడుతుంది. అజ్ఞానులు పూజలో ఉంటారు, జ్ఞానులు ధ్యానంలో ఉంటారు. కానీ ఇద్దరూ తీసుకునే

ఆహారం మాత్రం సాత్వికాహారమే కావాలి. ఎందుకంటే సాత్వికాహారమే భగవంతుడిపై దృష్టి నిలపడానికి అనుకూలంగా ఉంటుంది.

ఒక జ్ఞాని ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటాడు. రజ గుణాన్ని, తమో గుణాన్ని పెంచే ఆహారాలను ఎంతవరకు సాధ్యమో విడిచిపెట్టి, సత్వగుణాన్ని పెంచే ఆహారాన్ని తీసుకున్నప్పుడే మీ దృష్టి దేహ దృష్టి నుంచి దైవ దృష్టికి మారుతుంది. రజోగుణం, తమోగుణంలో ఉన్నప్పుడు దేహ దృష్టితో జీవిస్తారు. సత్వగుణంలో ఉన్నప్పుడు దైవ దృష్టితో ముందుకు సాగుతారు. అయితే ఈ విషయం తెలుసుకున్నంత మాత్రాన సరిపోదు. మీరు నిత్యం ధ్యానాన్ని అభ్యాసం చేయాలి, అభ్యాసం చేయాలంటే భగవంతుడిపై అంటే ఆత్మపై అచంచలమైన భక్తి ఉండాలి.

ఈ సృష్టికి మూల కారకుడు భగవంతుడే. ప్రతి జీవి సుఖంగా జీవించడానికి అవసరమైన ప్రతి దాన్నీ ఈ సృష్టిలో సమకూర్చింది భగవంతుడే అని మీరు గ్రహించినప్పుడు, మీలో భగవంతుడిపై నిజమైన భక్తి ఏర్పడుతుంది. ఒక్కసారి గమనించండి మీరు తెల్లవారగానే తీసుకునే మొదటి శ్వాసనే పరిశీలిస్తే, "భగవంతుని నుంచి వచ్చే ఈ విశ్వ శక్తి లేకపోతే నేను ఒక్క నిమిషం కూడా జీవించలేను" అనే సత్యాన్ని ముందుగా తెలుసుకోవాలి.

ఆ తర్వాత ఆహారం గురించి ఆలోచించండి ఈ విశాలమైన సృష్టిని భగవంతుడు మీ కోసం సృష్టించాడు. ఈ ఆహారం లేకపోతే మీ ఆకలి కూడా తీరదు. ఈ అన్నం కోసమే ప్రపంచమంతా కృషి చేస్తోంది. నేను బ్రతకడానికి, సాధన చేయడానికి, ఆనందంగా జీవించడానికి భగవంతుడు ఎన్నో వరాలను ప్రసాదించాడు అని మీరు విచారణ చేస్తూ తెలుసుకుంటే, భగవంతుడిపై అచంచలమైన భక్తి మీలో ఏర్పడుతుంది. అయితే భక్తి ఒక్కటే సరిపోదు. ఎంత భక్తి ఉన్నా మంచి కర్మలు చేయాలి.

భగవద్గీతలో చెప్పిన నిష్కామకర్మను ఆచరించాలి. మానవుడు కర్మ జీవి కాబట్టి నిరంతరం కర్మలు చేస్తూనే ఉంటాడు. పాప కర్మలు చేసినా, పుణ్య కర్మలు చేసినా జన్మ ఉంటుంది. మరి జన్మ లేని స్థితిని ఎలా పొందాలి? గీతలో భగవంతుడు చెప్పిన మార్గం ఇదే.. నిరంతరం కర్మలు చేయండి కానీ కర్మ ఫలాన్ని త్యాగం చేయండి. ఎలాంటి కోరిక లేకుండా నిష్కామకర్మ చేసి, ఆ కర్మ ఫలాన్ని పరమాత్మకు అర్పిస్తే, మీ ధ్యానం ఎంతో చక్కగా స్థిరపడుతుంది.

కానీ మనిషి ఇక్కడే పొరబడతాడు ఎంత గొప్ప పుణ్య కార్యాలు చేసినా మాయకు లోనై, "నేనే చేస్తున్నాను" అని అనుకుంటాడు. ప్రతి క్షణం "నేను నేను నేను" అనే అహంకారంతో జీవిస్తాడు. కానీ మీలో ఆత్మ రూపంగా ఉన్న భగవంతుడు లేకపోతే, ఈ శరీరం ఒక్క అంగుళం కూడా కదలదు. ఒక్క క్షణం కూడా శక్తిని ప్రదర్శించలేదు. అయినా ఈ దేహానికే పెద్దపీట వేసి, "నేనే చేశాను" అని భావిస్తే, మీకు భగవంతుడిపై సంపూర్ణమైన భక్తి కలగలేదు అన్న మాట.

మీ భక్తి నిర్మలంగా ఉండాలి. నిర్మలమైన భక్తి అంటే కల్తీ భక్తి కాదు, కోరికలతో చేసే భక్తి కాదు, కోరికలు తీర్చుకోవడానికి చేసే భక్తి గొప్పది కాదు. ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త గురించి మీరు ఆలోచించి, "నాదంటూ ఏదీ లేదు", "నేనేమీ చేయడం లేదు, భగవంతుడే నా ద్వారా అన్నీ చేయిస్తున్నాడు" అని భావించగలిగితే, అప్పుడే మీ భక్తి నిర్మల భక్తిగా మారుతుంది. ఆ నిష్కామకర్మ వల్లే మీ భక్తి పవిత్రమవుతుంది. ఈ భక్తిని ఇంకా పెంచుకోవాలంటే "సర్వ జీవుల సేవే సర్వేశ్వరుని సేవ" అనే సత్యాన్ని తెలుసుకోవాలి.

మీ కంటే బలహీనమైన జీవులను మీరు కాపాడాలి. పత్రీ గారి పుణ్యమా అని ఎంతోమంది శాకాహారులుగా మారి, అనేక జీవులను స్వేచ్ఛగా జీవించనిస్తున్నారు. మీరు హింసిస్తే పాపం, జీవించనిస్తే పుణ్యం. అంతేకాదు,

ఒక జీవిని చంపకుండా, అది తన జీవితాన్ని పూర్తి చేసుకునే అవకాశం కల్పించినప్పుడు, అది కేవలం పుణ్య కర్మ మాత్రమే కాదు, ఆత్మ కర్మ కూడా అవుతుంది. ఎందుకంటే ఆ శరీరంలో ఉన్న ఆత్మ ఎంతకాలం ఆ శరీరంతో ఉండాలో నిర్ణయించుకుని వచ్చిందో, మీరు దానిని హింసించకుండా స్వేచ్ఛగా జీవించనిస్తే, ఆ ఆత్మ తన ప్రయాణాన్ని పూర్తిచేసుకునే అవకాశం లభిస్తుంది.

అందుకే ఈశ్వర సేవ అంటే సర్వ జీవుల సేవ అని తెలుసుకోవాలి. మీరు మరింత మందిని శాకాహారులుగా మారిస్తే, అది కూడా ఒక గొప్ప ఆత్మ సేవ అవుతుంది. అలాంటి సేవ భగవంతుడికి అత్యంత ఇష్టమైనది.

మానవుణ్ణి ఎక్కువగా ఇబ్బంది పెట్టేది చిత్తమే. ఈ చిత్తం మిమ్మల్ని బాధించకుండా, గత జ్ఞాపకాలు వెంటాడకుండా, భవిష్యత్తు గురించి భయం లేకుండా జీవించాలంటే మీరు జ్ఞానాన్ని సంపాదించాలి, జ్ఞానం లేకపోతే చిత్తం మిమ్మల్ని ఎప్పుడూ చింతలోనే ఉంచుతుంది.

మరి ఏ జ్ఞానం రావాలి? "నేను శరీరం కాదు నేను ఆత్మను" అనే జ్ఞానం రావాలి. ఈ జ్ఞానం కలిగినప్పుడు గతంలో జరిగిన బాధల గురించి విచారం ఉండదు, భవిష్యత్తు గురించి భయం కూడా ఉండదు. ఎందుకంటే గతంలో అనుభవించిన బాధలన్నీ కర్మ ఫలాలేనని మీరు అర్థం చేసుకుంటారు. మరి ఆ కర్మలు ఎందుకు వచ్చాయి? మీరు "నేనే శరీరం" అనే భావనతో అస్తవ్యస్తమైన జీవితాన్ని గడిపారు. సాధన లేకుండా, జ్ఞానం లేకుండా జీవించారు, అందుకే ఆ కర్మలు ఏర్పడ్డాయి. ఎప్పుడైతే మానవుడు "నేను శరీరమే" అని అనుకుంటాడో, అప్పుడే అతనికి జ్ఞానం లేనట్టే. అతని జీవితంలోకి సద్గురువు రాలేదు, సత్యం తెలియలేదు అని అర్థం.

కానీ ఇప్పుడు మీరు సత్యాన్ని తెలుసుకున్నా కూడా, దానికి అనుగుణంగా ప్రవర్తించ లేకపోవడానికి మీ సంస్కారాలు, వాసనలే కారణం. ముక్తికోపనిషత్తులో శ్రీరాముడు చెప్పిన విషయం "ఎన్ని విషయాలు విన్నా,

శిష్యులలో మార్పు రావడం లేదు, ఆచరణలో పెట్టుకోవడం లేదు అంటే దానికి కారణం "వారిలో దేహ వాసన, శాస్త్ర వాసన లేదా లోక వాసన ఈ మూడింటిలో ఏదో ఒకటి బలంగా వున్నట్టు. ఈ మూడు వాసనల వల్లే జీవుడు విన్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టుకోలేక పోతున్నాడు" అని చెప్పబడింది.

ఉదాహరణకు, ఇప్పుడు చాలామందికి గురువు ద్వారా ఒక విషయం తెలుసు. విగ్రహారాధన కంటే ఆత్మారాధనే గొప్పది అని తెలుసుకుంటారు. కానీ ఇంటికి వెళ్ళగానే, "అయితే పూజ చేయాలా? మానేయాలా?" అని వెంటనే అడుగుతారు. అదే లోక వాసన. "లోకులు ఏమనుకుంటారు? పూజలు మానేస్తే ఇంట్లో వాళ్ళు ఏమనుకుంటారు? భర్త ఏమనుకుంటాడు? అత్త గారు ఏమనుకుంటారు?" అనే ఆలోచనలే లోక వాసన.

ఈ వాసనలతో నిండిన చిత్తంలో భయాలు ఎక్కువగా ఉంటాయి. నేనైతే ఒకటే చెబుతాను. "చేసుకుంటే నష్టమేమీ లేదు. కానీ చేసుకుంటూ ఉంటే ఒకరోజు మీకే విసుగు వస్తుంది. ఎప్పుడైతే మీరు ధ్యానం ప్రారంభిస్తారో, అప్పుడే ఆత్మానందాన్ని అనుభవించడం మొదలవుతుంది" అని చెబుతాను. ఇక్కడ ప్రతి ఒక్కరూ గమనించాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఉంది. మానవునికి మనసు ఉంది, ఆత్మ కూడా ఉంది. మీ మనసు వెంటనే, "అది చేయకపోతే ఎలా?" అని ప్రశ్నిస్తుంది. అది మనసు మీరు దానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

కానీ దాని వెనుక ఉన్న ఆత్మ చాలా నెమ్మదిగా చెబుతుంది. "నువ్వు అంతకంటే గొప్ప సాధన చేస్తున్నావు కదా! మరి ఇది అవసరమా?" అని లోపల నుంచి సున్నితంగా సూచిస్తుంది. మహాత్ములు ఒకచోట ఇలా చెప్పారు, "దైవం గొంతు చాలా సన్నగా ఉంటుంది, కానీ మనసు గొంతు రాక్షసుడి గొంతులా చాలా పెద్దగా వినిపిస్తుంది" అందుకే మనసు వెంటనే, "అది చేయకపోతే ఎలా? వాళ్ళు ఏమనుకుంటారు? వీళ్ళు ఏమంటారు?" అని

గట్టిగా భయపెడుతుంది.

సత్యం తెలిసిన తర్వాత కూడా మనసుకు భయం ఉంటుంది. ఎందుకంటే, మీరు సత్యంలో జీవించడం ప్రారంభిస్తే తన ఆధిపత్యం పోతుందని మనసుకు తెలుసు. అందుకే అది గట్టిగా మాట్లాడుతుంది. "వాళ్ళు అలా అనుకుంటున్నారు వీళ్ళు ఇలా అనుకుంటున్నారు చేయకపోతే ఎలా?" అని ఎన్నో ఆలోచనలు తెస్తుంది. కానీ "నేను శరీరం కాదు, నేను ఆత్మను" అని తెలుసుకున్న యోగికి కర్మకాండల అవసరం ఉండదు. ఎందుకంటే, సర్వాత్మ స్వరూపుడైన పరమాత్మను తెలుసుకున్న యోగికి, "నేనే ఈ శరీరం" అనే భావంతో చేసే కర్మకాండలు అవసరం ఉండవు.

అప్పుడు మళ్ళీ చాలామంది అడుగుతారు. "అయితే తద్దినం పెట్టొద్దా? పండితుడిని పిలవొద్దా?" అని. నేనైతే ఇలా చెబుతాను."పెట్టాలనిపిస్తే పెట్టండి పండితుడు తింటాడు, మీ భయం కూడా తగ్గుతుంది" అని. ఎందుకంటే, ఇంకా ఆ స్థాయి రాలేదు, ఇంకా అంత అవగాహన లేదు, మంత్రాల అర్థం కూడా పూర్తిగా తెలియదు, వినే వారికీ, చెప్పే వారికీ జ్ఞానం తెలియదు.

అందుకే ఎవరికైనా భయం ఉంటే చేసుకోండి అని చెబుతాను "మేడం ఇలా ఎందుకు చెబుతున్నారు?" అని కొందరు అనుకోవచ్చు. కానీ ఒకరోజు మీరు కూడా తప్పకుండా మార్పు చెందుతారు. ధ్యానం గురించి తెలుసుకున్నా, అది ఇంకా మీ ఆచరణలోకి రాకపోతే భయాలు సహజంగానే ఉంటాయి. అప్పుడు చిత్తం ఎప్పుడూ ఆ భయాల వెనుకే పరుగెత్తుతుంది. "ఏమవుతుందో ఏమో! పూజలు మానేసిన తర్వాత ఇంట్లో ఏదైనా అరిష్టం జరిగితే, అందరూ పూజలు మానేసినందుకే ఇలా జరిగిందని అంటారు" అనే భయాలు వస్తాయి. నేను మీకు ఇదివరకే చెప్పాను, పిరమిడ్ ధ్యానం చేసే వారిని కొందరు, "పూజలు మానేసి ధ్యానం చేస్తున్నారు కాబట్టే ఇలా జరిగింది"

అని అంటుంటారు.

కానీ మీరు ఒక్కసారి ఆలోచించండి. పూజలు చేసే వారి ఇంట్లో మరణాలు జరగవా? పూజలు చేసే వారి ఇళ్ళలో రోగాలు రావా? అని వివేకం ఉన్నవాడు ఈ ప్రశ్నలు వేసుకుంటాడు. వివేకం లేనివాడు జరిగిన ప్రతి సంఘటనకూ ఒక కారణం ఊహించుకొని, "ఇదంతా దీని వల్లే జరిగింది" అని నిర్ణయిస్తాడు. ఒక అజ్ఞాని చెప్పిన మాటలకు మీరు విలువ ఇస్తున్నంత కాలం, ప్రపంచం చెప్పే మాటలకు విలువ ఇస్తున్నంత కాలం, మీరు సత్యం నుంచి దూరంగానే ఉంటారు. సత్యం వైపు ప్రయాణించడం అంత సులభమైన విషయం కాదు. ఊరికే ధ్యానం గురించి తెలుసుకుని, కొంతకాలం సాధన చేసి, కొన్ని క్లాసులు పెట్టి, పిరమిడ్లు కట్టి, "నేను జ్ఞానిని" అని అనిపించుకోవడం వల్ల జ్ఞానం రాదు.

ఇంట్లో ఏదైనా బాధ కలిగితే, "ఈ ధ్యానం వల్లే జరిగింది", "పూజలు మానేసినందుకే ఇలా జరిగింది" అని అజ్ఞాని ఎన్నో మాటలు మాట్లాడతాడు. కానీ అలాంటి మాటలకు మీరు ఎందుకు విలువ ఇవ్వాలి? ఆత్మకు విలువ ఇవ్వడం పాపమా? తప్పా? నేరమా? ఈ ప్రశ్నను అడిగే ధైర్యం కూడా మీకు లేకపోతే, ధ్యానంలో ఎలా ముందుకు సాగగలరు? ధ్యానం చేసిన తర్వాత కూడా అపరిమితమైన పరమాత్మకు పరిమితమైన రూపాన్ని కల్పించి, మీరే తయారు చేసిన విగ్రహాన్ని, మీరే తయారు చేయించిన చిత్రాన్ని పూజిస్తారు. అది షాపులో ఉన్నంత వరకు సాధారణ వస్తువే. ఇంటికి తీసుకొచ్చి బొట్టు పెట్టి, పసుపు పెట్టి, "ఇదే దేవుడు" అని భావిస్తారు. తర్వాత పూజ మానేస్తే, "అయ్యో! ఎంత అరిష్టం జరిగిపోయింది" అని భయపడతారు.

ఇలా మీరే ఒక భావాన్ని సృష్టించుకుని, మీరే దానికి భయపడుతూ, గురువులు చెబుతున్న జ్ఞానాన్ని వదిలేసి, మళ్ళీ అజ్ఞానంలోకి వెళ్ళిపోతున్నారు అంటే మీ వాసనలు ఇంకా పోలేదు. వాసనలు పోలేదు కాబట్టే ఈ భయాలు

వస్తున్నాయి. మరి చిత్తం ఎప్పుడు నిర్మలమవుతుంది? ఎప్పుడు నిశ్చలమవుతుంది? అదే కారణంగా అది ధ్యానంలో ఎప్పుడూ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. ధ్యానానికి కూర్చుంటారు కానీ, “ఏమిటి? ధ్యానం కుదరడం లేదు” అనిపిస్తుంది. ఎందుకంటే చిత్తం గతానికి, భవిష్యత్తుకి పరిగెడుతూనే ఉంటుంది. చిత్తం నిశ్చలమవ్వాలంటే మీరు పదే పదే జ్ఞానాన్ని వినాలి.

గురువు ఎందుకు “విగ్రహారాధన కాదు, ఆత్మా రాధన ఉండాలి” అని చెప్పారు? ఆత్మా రాధన అంటే ఆత్మయే భగవంతుడు. భగవంతుడు పరిమిత రూపం కాదు. విశ్వమంతా వ్యాపించి ఉన్న అపరిమిత చైతన్యమే భగవంతుడు. ఈ విషయాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకోనంత వరకు చిత్తంలో బాధలు, చింతలు ఉంటూనే ఉంటాయి. ఆ చింతలు పోవాలంటే మీరు ఇంకా జ్ఞానాన్ని సంపాదించాలి.

భగవంతుడి గురించి సరైన అవగాహన వచ్చే వరకు మీరు సంశయ చిత్తులుగానే ఉంటారు. మరి ఏ అవగాహన రావాలి? సర్వత్రా వ్యాపించి ఉన్న ఆ చైతన్యమే భగవంతుడు. భగవంతుడు అంటే ఒక రూపం కాదు, ఒక పేరు పెట్టామని ఒక రూపంగా భావించకూడదు. ఆయన ఒక శక్తి, ఒక చైతన్యం, ఆయన అపరిమితుడు. “ఇక్కడ ఉంటాడు, అక్కడ ఉండడు” అనే పరిమితి ఆయనకు లేదు. కానీ మీరు పరిమిత రూపాన్ని కల్పించుకుని, దానికే పూజ చేస్తూ, అపరిమితుడైన దైవాన్ని అర్థం చేసుకోలేకపోతే, ఇంకా సంశయ చిత్తులుగానే ఉంటారు.

అందుకే ఇంకా సీనియర్లు కనిపిస్తే సందేహాలు అడుగుతూ ఉంటే గురువు చెప్పిన జ్ఞానం ఇంకా పూర్తిగా మీ బుద్ధిలోకి వెళ్ళలేదు. దానిపై విచారణ చేయలేదు, విశ్వాసం కూడా పూర్తిగా కలగలేదు. జ్ఞానం పెరగాలంటే గురువుపై విశ్వాసం ఉండాలి. అలాగే విచారణ కూడా ఉండాలి. అందుకే వశిష్ఠ మహర్షి చెప్పారు, “విచారణే పరమ జ్ఞానం.” గురువు ఒక మాట

చెప్పినప్పుడు మీరు దాని లోతుల్లోకి వెళ్ళాలి, అదే విచారణ, ఆ తర్వాత విశ్లేషణ చేయాలి.

ఓషో కూడా ఇదే చెప్పారు "విశ్లేషణ చేయండి, లోతుల్లోకి వెళ్లండి ఇంకా లోతుల్లోకి వెళ్లండి ఎక్కడైతే సమాధానం దొరుకుతుందో అక్కడ ఆగండి. అదే అసలైన సమాధానం" అని చెప్పారు. విశ్లేషణ అంటే పరిశోధన చేయడం, ఒక విషయాన్ని లోతుల్లోకి, ఇంకా లోతుల్లోకి పరిశీలిస్తూ వెళ్ళాలి. చివరికి దానికి సమాధానం దొరకని స్థితికి చేరుకున్నప్పుడు, అక్కడే సత్యం ప్రత్యక్షమవుతుంది. మీరు ఎంతవరకు విచారణ చేస్తున్నారు? ఎంతవరకు విశ్లేషణ చేస్తున్నారు? విచారణ ఎక్కువైన కొద్దీ, జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలనే కోరిక కూడా పెరుగుతుంది.

కానీ రెండు విషయాలు విని, క్లాసుల్లో పాఠాలు విని, పరీక్షలు వ్రాసినట్లుగా గుర్తుపెట్టుకుని, ఆచరణ లేకుండానే అందరికీ చెప్పడం ప్రారంభిస్తే, మీకే సందేహం పోలేదు కదా! మరి ఎదుటివారి సందేహాలను మీరు ఎలా తీర్చగలరు? క్లాసులు చెప్పాలనే కోరిక ఉండకూడదు. గురువు చెప్పిన జ్ఞానాన్ని మీ జీవితంలో ఎంతవరకు అనుభవంగా మార్చుకున్నారన్నదే ముఖ్యమైనది.

అఖండమైన జ్ఞానం అంటే ముక్కలుగా ఉన్న జ్ఞానం కాదు. ఈ సృష్టి అంతా పరమాత్మ స్వరూపమే అని తెలుసుకోవడమే అఖండ జ్ఞానం. మీలో, నాలో, సమస్త సృష్టిలో ఉన్నది పరమాత్మ చైతన్యమే. అదే ఈ సృష్టిని నడిపిస్తోంది అని మీరు తెలుసుకోగలిగితే, దానిని నమ్మ గలిగితే, గురువు మాటపై సంపూర్ణ విశ్వాసం ఉంటే, మీకు అఖండ జ్ఞానం వచ్చినట్లే. అనుక్షణం మీరు ఆ ఆలోచనలోనే ఉండాలి. అప్పుడు జ్ఞానం స్థిరపడుతుంది. కానీ మధ్య మధ్యలో ఆ ఆలోచన నుంచి జారిపోతుంటారు. "పరమాత్మ నా హృదయంలోనే ఉన్నాడు" అని అనుకుంటారు. కానీ అందులోకి వెళ్ళడమే చాలా కష్టం. మధ్యలో మనసు ఏదో ఒక ఆలోచన తీసుకొస్తుంది. వెంటనే బుద్ధి అటు వైపు

వెళ్ళిపోతుంది.

ఉదాహరణకు, మీరు ఒక పుస్తకం చదువుతున్నారు, చిన్న శబ్దం వచ్చినా వెంటనే ప్రక్కకు చూస్తారు. చూసి ఊరుకోరు, "ఏమైంది? ఎందుకు జరిగింది? ఏమి కావాలి?" అని మళ్ళీ ప్రపంచం వైపు వెళ్ళిపోతారు. ప్రకృతి మన చుట్టూ ఎప్పుడూ ఉంటుంది. మీరు ప్రతి క్షణం ఆత్మలోకి ప్రవేశించాలని ప్రయత్నించినప్పుడు, ప్రకృతి ఏదో ఒక విధంగా మిమ్మల్ని డిస్టర్బ్ చేసి మళ్ళీ ప్రపంచంలోకి తీసుకువస్తుంది. ఈ మాయను జయించాలంటే, మీలో భగవంతుడిపై భక్తి, జ్ఞానం పొందాలనే శ్రద్ధ ఈ రెండు చాలా బలంగా ఉండాలి. ఈ రెండూ దొరకని రోజున, వాటి కోసం ఎంతగా తపించాలో అంతగా తపించాలి. అంటే అచంచలమైన భక్తి, అచంచలమైన శ్రద్ధ ఈ రెండూ ఉన్నప్పుడు, "నేనే ఆత్మను అయినా, ఆ ఆత్మను ఇంకా ప్రత్యక్షంగా దర్శించ లేకపోతున్నాను. దానికి కారణం ఏమిటి?" అని మీరు కారణాన్ని వెతకగలగాలి.

అందరికీ ప్రాపంచిక జీవితం ఉంటుంది. మీరు కూడా ప్రాపంచిక జీవితంలో జీవిస్తూ, అవసరాల కోసం మీ దృష్టిని బయటికి మళ్ళిస్తున్నారు. కానీ బయటికి వెళ్ళిన ఆ దృష్టి మళ్ళీ వాసనల రూపంలో మీలోకే వస్తుంది. వాసనలు అంటే ఏమిటి? ఒక విషయాన్ని చూస్తారు, ఒక పని చేస్తారు, తర్వాత కళ్ళు మూస్తే అవే విషయాలు గుర్తుకు వస్తుంటాయి. ఇవన్నీ ప్రకృతి పెట్టే పరీక్షలే అని మీరు ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి. అలా తెలుసుకుంటూ ఉంటే, మెల్లగా మీరు ఎక్కడ పడిపోతున్నారో, ఎక్కడ ఎదుగుతున్నారో మీకే అర్థమవుతుంది. "నేను పడిపోతున్నాను" అని తెలుసుకోవడం మాత్రమే సరిపోదు. "ఎందుకు పడిపోతున్నాను?" అని కూడా కనిపెట్టుకోవాలి. దేని వల్ల నా ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయి? అని ఎప్పటికప్పుడు పరిశీలించాలి.

దానికి ప్రధాన కారణం "నేనే శరీరం" అనే అహంకార వాసన ఇంకా పూర్తిగా పోక పోవడమే. అందుకే ఎవరైనా పొగిడితే పొంగిపోతారు,

విమర్శిస్తే బాధపడతారు. కానీ ఒకసారి ఆలోచించండి మీరు సత్యంలో ఉన్నారు కాబట్టే మిమ్మల్ని పొగుడుతున్నారు. మరి దానికి అహంకారం ఎందుకు? "మీరు గొప్ప వారు" అని చెప్పడానికి కారణం, మీలో ఉన్న ఆత్మ రూపమైన దైవశక్తి. ఆ ఆత్మ ఉన్నందువల్లే ఈ శరీరం ద్వారా గొప్ప పనులు జరుగుతున్నాయి.

మిమ్మల్ని పొగిడే వ్యక్తికి ఈ సత్యం తెలియక పోవచ్చు. కానీ మీరు మాత్రం, "ఆత్మ వల్లే నేను ఈ పని చేయగలిగాను" అనే బుద్ధితో ఉండాలి. అప్పుడు అహంకారం పెరగదు. ఏ పనినైనా చేసి గర్వపడాల్సిన అవసరం లేదు. ఆత్మే మీ చేత అన్నీ చేయిస్తోంది. ఆ గొప్పతనం ఏదైనా ఉంటే, అది ఆత్మకే చెందుతుంది.

ఇలా ప్రతి విషయాన్ని చూడగలిగినా, చదువగలిగినా, వినగలిగినా, ఏ పని చేసినా, "ఆత్మ వల్లే నేను చేస్తున్నాను" అనే ఎరుకను కోల్పోకుండా ఉంటే, మీకు అహంకారం రాదు. అహంకారం వస్తోంది అంటే మీరు దేహ స్థితిలో పడిపోతున్నారు. అహంకారం రావడం లేదు అంటే మీరు ఆత్మ స్థితికి ఎదుగుతున్నారు. గురువులు ఎన్నో సార్లు చెబుతారు. "నేను ఆత్మను నేను ఆత్మను" అని తెలుసుకోండి, అనుకోండి, అనుభవంలోకి తెచ్చుకోండి అని.

ఎందుకంటే ప్రస్తుతం మీరు చేసే ప్రతి పనినీ ఈ శరీరం ద్వారానే చేస్తున్నారు. ఒక రైలు నడుస్తోంది అంటే అది ఇంజన్ వల్లే నడుస్తుంది. ఇంజన్ అన్ని బోగీలను లాగుతూ ముందుకు తీసుకెళ్తుంది. ఇంకా చెప్పాలంటే, ఆ ఇంజన్‌ను నడిపేది డ్రైవర్. మీ పరిస్థితి కూడా అంతే. ఈ శరీరం, మనసు, బుద్ధి, చిత్తం అనే బోగీలన్నీ నడుస్తున్నాయి అంటే, వాటి లోపల ఉన్న ఇంజన్ అయిన ఆత్మ వల్లే నడుస్తున్నాయి. ఈ సత్యం మీకు ఎంతగా అర్థమవుతుందో, అంతగా మీ జ్ఞానం పెరుగుతూ ఉంటుంది. అందుకే మీరు ఏ ఉపనిషత్తు తీసుకున్నా, దాని చివర ఇచ్చే సందేశం ఒక్కటే. అదే అహంకారాన్ని

నశింపజేయాలి. అహంకారం అంటే బయట నుంచి కొత్తగా వచ్చేది ఏమీ కాదు. "నేను దేహాన్ని" అని అనుకుంటే అది అహంకారం. "నేను ఆత్మను" అని అనుకుంటే అది వినయం.

అందుకే అహంకారం నశించాలి, దేహ భావన పోవాలి, జీవుడు ఆత్మ భావనలోకి, దైవ భావనలోకి రావాలి, అప్పుడు అహంకారం ఉండదు. అహంకారం అంటే గర్వం అనే అర్థం కూడా ఉంది. అది పొగడ్తల వల్ల వస్తుంది. కానీ ఇక్కడ చెప్పే సత్యం వేరు, "నేను ఆత్మను, ఇది నా శరీరం" అని భావించడం సత్యం. కానీ ఇప్పుడు మీరు దానికి విరుద్ధంగా, "నేనే శరీరం, నాలో ఆత్మ ఉంది" అని అనుకుంటున్నారు. ఈ భావం మారాలి, మీ భావం మారినప్పుడు మీరు జ్ఞానాన్ని పొందినట్టే.

అయితే జ్ఞానం వచ్చినా ఇంకా ఆత్మ దర్శనం కలగలేదు అంటే, దానికి ఇంకా సమయం ఉందేమో! ఆ సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా జరుగుతుంది. కానీ అప్పటి వరకు మీరు "నేను ఆత్మను, నేను ఆత్మను" అనే భావంలోనే ఉండాలి. అహంకారం నశించినవాడు అంటే, "నేను శరీరాన్ని" అనే భావం పూర్తిగా నశించి, "నేను ఆత్మను" అనే భావం నిరంతరం పెరుగుతూ ఉండే వ్యక్తి. ఎప్పుడైతే మీరు "నేను ఆత్మను" అనే భావంతో జీవిస్తారో, అప్పుడే పరమాత్మను చేరుకోవడానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలించడం ప్రారంభిస్తాయి. "ఇంకా నాకు ఆత్మ దర్శనం కలగలేదు" అని కొందరు బాధపడవచ్చు. నేనైతే ఏమనుకుంటానంటే, ఈ భూమిపై నాకు ఇంకా చేయాల్సిన పని ఉంది కాబట్టే, ఇప్పటికీ ఆత్మ దర్శనం కలగలేదేమో అని భావిస్తాను.

కానీ దాని గురించి నేను ఎన్నడూ నిరుత్సాహపడను. ఎందుకంటే, మీరు ఎవరికైనా ఏ విషయం చెప్పినా, ముందు దానిని ఆచరణలో పెట్టి చెప్పాలి. నేను మీకు ఎన్నో సార్లు చెప్పాను, ఆచరణలో పెట్టిన మాటలు రాతి

మీద వ్రాతల లాంటివి, ఆచరణ లేని మాటలు నీటిమీద వ్రాతల లాంటివి. మీరు ఎంతమందికి జ్ఞానం చెబుతారో, అంతగా మీకే అర్థమవుతుంది. “నేను ఆత్మను” అనే జ్ఞానం నాకు ఉంది. కానీ ఇంకా ఆత్మ దర్శనం కలగలేదని నేను ఎప్పుడూ బాధపడను.

ఎందుకంటే, భగవంతుడి నిర్ణయాలు ఎప్పుడూ సరైనవే. ఆయన నిర్ణయం సరైనదే అయితే, నాకు ఇంకా ఎందుకు ఆత్మ దర్శనం కలగలేదో కూడా ఆయనకే తెలుసు. అలాంటి విషయాన్ని గురించి నేను ఎందుకు చింతించాలి?ఎప్పుడు కలగాలో అప్పుడు తప్పకుండా కలుగుతుంది. అంతవరకు మీరు సాధన చేస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ, క్లాసులు చెబుతూ, పుస్తకాలు చదువుతూ, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇదే ఆనందకరమైన జీవితం. ఈ స్థితిలో జీవించడం దుఃఖకరమైన జీవితం కాదు. ఇది నిజమైన ఆనందకరమైన జీవితం. భగవంతుడు ఇచ్చే ప్రతి అవకాశాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. ఆత్మ దర్శనం రాలేదని బాధపడకూడదు, వచ్చిందని సంబర పడకూడదు. భగవంతుడు ఏది చేయమంటే అది చేయాలి,ఎటు నడిపిస్తే అటు నడవాలి, ఈ భావం మీలో స్థిరపడినప్పుడు, ఆత్మ దర్శనం ఎలా కలుగు తుందో మీకు స్పష్టంగా తెలుస్తుంది. దానికి కావాల్సిన మార్గం కూడా మీకు తెలుస్తుంది.

మీరు ఆచరిస్తూ ఉంటే, జరగాల్సిన సమయంలో అది సహజంగానే జరుగుతుంది. దాని కోసం మీరు బాధపడాల్సిన అవసరం లేదు. అయితే ఒక విషయం మాత్రం ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. మీరు సత్యంలో ఉన్నారా? లేదా? సత్య మార్గంలోనే కొనసాగుతున్నారా?లేక మళ్ళీ ఏదైనా అసత్యం వైపు అడుగులు వేస్తున్నారా?అని నిరంతరం విచారణ చేసుకుంటూ, వివేకంతో ప్రవర్తించాలి. విచారణ లేకపోతే జ్ఞానం పెరగదు, వివేకం లేకపోతే మళ్ళీ అజ్ఞానంలోకి వెళ్ళిపోతారు. అందుకే విచారణ, వివేకం ఈ రెండూ మీలో ఎల్లప్పుడూ ఉండాలి.

మానవ జన్మ యొక్క ప్రయోజనం ఏమిటి?

ఈ కలియుగంలో ఆత్మజ్ఞానం అనే పదమే కనుమరుగైపోయింది. జ్ఞానం గురించి చెప్పే వాళ్ళు చాలా అరుదుగా ఉన్నారు, చెప్పినా వాటి అసలు అర్థాన్ని లోతుగా గ్రహించే వాళ్ళు ఇంకా అరుదుగా ఉన్నారు. ఎవరిలో అయితే సత్యాన్ని తెలుసుకోవాలనే తపన, సత్యాన్ని స్వీకరించే అర్హత లోపించిందో, అలాంటి వారికి ఆత్మజ్ఞానం లభించినా దాని సార్థకత ఉండదు. ఎందుకంటే ఇది గొప్ప పేరు, ప్రతిష్ఠ లేదా పాండిత్యం కోసం నేర్చుకునే విద్య కాదు, భగవంతుడిని తెలుసుకోవాలి, భగవంతుడిని చేరుకోవాలి, తన అసలు స్వరూపాన్ని తెలుసుకోవాలి అనుకునే వారు తెలుసుకోవాల్సిన అత్యున్నత విద్య.

మరి మానవ జన్మ యొక్క అసలు ప్రయోజనం ఏమిటి? సృష్టిలోని అన్ని జీవరాశులకంటే మానవుడే గొప్పవాడు అని ఎందుకు చెబుతున్నారు? దానికి ప్రధాన కారణం మానవుడికి లభించిన విచక్షణతో కూడిన బుద్ధి. సృష్టిలోని జీవరాశులను పరిశీలిస్తే, శిలలుగా ఉన్నప్పుడు బుద్ధి వ్యక్తం కాదు, ఖనిజాలుగా ఉన్నప్పుడు కూడా బుద్ధి వ్యక్తం కాదు, వృక్షాలుగా ఉన్నప్పుడు కూడా బుద్ధి వ్యక్తం కాదు, అలాగే పాకే జీవులుగా, ఎగిరే పక్షులుగా ఉన్నప్పుడు కూడా వాటి బుద్ధి పరిమితమైన అవసరాలకు మాత్రమే పనిచేస్తుంది. పశు జన్మలో కొంత బుద్ధి ఉన్నప్పటికీ, అవి ప్రధానంగా తమ ఆహారాన్ని సంపాదించుకోవడానికి, తమకు ప్రమాదం ఎదురైనప్పుడు దాని నుంచి తప్పించుకోవడానికి మాత్రమే బుద్ధిని ఉపయోగిస్తాయి. ఆకలి వేసినప్పుడు ఆహారం కోసం వెతుకుతాయి, ఆహారం అనిపిస్తే తింటాయి, ప్రమాదం ఎదురైనప్పుడు దాన్ని గుర్తించి తప్పించుకుంటాయి.

ఉదాహరణకు ఒక పశువులశాలలో అగ్ని ప్రమాదం జరిగిందను

కోండి అప్పుడు అక్కడ ఉన్న పశువులు ఏం చేస్తాయి? తమ ప్రాణాలను రక్షించుకోవడానికి కట్లు తెంచుకుని బయటకు పారిపోతాయి. అంటే, ప్రమాదం వచ్చినప్పుడు మాత్రమే అవి తమ బుద్ధిని ఉపయోగించి, ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఇలా పశువులు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే బుద్ధిని ఉపయోగిస్తాయి, మిగతా సందర్భాల్లో వాటి బుద్ధి పరిమితంగానే పనిచేస్తుంది. కానీ మానవుడు తనకు లభించిన బుద్ధిని అన్ని సందర్భాల్లోనూ ఉపయోగించుకోగలడు. అందుకే భగవంతుడు మానవుడికి ఇచ్చిన బుద్ధి కేవలం తినడానికి, సంపాదించడానికి, సుఖాలను అనుభవించ డానికి మాత్రమే కాదు, భగవంతుడు ఎవరు? తాను ఎవరు? ఈ మానవ జన్మ ఎందుకు వచ్చింది? అనే విషయాలను విచారించి తెలుసుకోగలిగేంత ఉన్నతమైనది. అందుకే మీరు ఏదైనా తప్పు పని చేస్తే, "బుద్ధి లేదా?" అని తిడతారు. "బుద్ధి సరిగ్గా పనిచేయడం లేదా?" అని అడుగుతారు. మీ మాటల్లో కానీ, మీ చేతల్లో కానీ సరైన మార్గంలో లేకపోతే, "వీడు బుద్ధితో విచారణ చేయకుండా, తనకు ఉన్న బుద్ధిని సరిగ్గా ఉపయోగించకుండా జీవిస్తున్నాడు" అని ఎదుటి వారికి అర్థమవుతుంది.

మరి మానవుడు అంటే కర్మ జీవి, నిరంతరం కర్మలు చేస్తూనే జీవించాలి, కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేడు. ఏ పశువు కానీ, ఏ పక్షి కానీ తమ ఆహారాన్ని సంపాదించుకోవడానికి మనిషిలా ఎన్నో రకాలుగా శ్రమించాల్సిన అవసరం ఉండదు. కానీ మానవుడు తన ఆహారాన్ని తానే సంపాదించుకోవాలి, అవసరమైతే పండించుకోవాలి, వండుకోవాలి, తన జీవితం సక్రమంగా సాగడానికి కష్టపడాలి, పని చేయాలి, ప్రయత్నించాలి.

మానవుడికి కష్టపడటం, పని చేయడం, పండించుకోవడం, వంట చేసుకోవడం, కుటుంబాన్ని చూసుకోవడం, సమాజంలో బాధ్యతలను

నిర్వర్తించడం వంటి ఎన్నో పనులు ఉంటాయి. అందుకే ప్రాపంచిక జీవితంలో మీరు ఎలా జీవించినా, కొన్ని విషయాల్లో నష్టపోవచ్చు, కొన్ని తప్పులు జరగవచ్చు, అయినా ఆ జీవితం పూర్తిగా వృథా అయిపోదు. కానీ మీరు ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన తర్వాత మాత్రం ప్రతి క్షణం ఎంతో విలువైనదిగా భావించాలి. “నేను ఈ మానవ జన్మ ఎందుకు తీసుకున్నాను? నా జీవితానికి అసలు ప్రయోజనం ఏమిటి? నేను ఎందుకు ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాను? నా ఎదుగుదలకు నేను ఏం చేయాలి? నా బుద్ధిని ఏ దిశగా ఉపయోగించాలి?” అని నిరంతరం విచారణ చేసుకుంటూ, మీలో మీరు మార్పు తెచ్చుకుంటూ, ఆత్మజ్ఞానం వైపు ఎదగడానికి ప్రయత్నించాలి.

మీరు సత్యం గురించి తెలుసుకోవడం ఒక విషయం, ఆ సత్యాన్ని అనుభవించి, ఆ స్థితిని సాధించడం మరొక విషయం. మీరు సత్యాన్ని తెలుసుకున్నదాన్ని ఆచరణలో పెట్టి సాధించడానికి జన్మలు పట్టవచ్చు. ఒక జన్మలో మీరు థియరీ క్లాస్ మొత్తం నేర్చుకున్నా, ప్రాక్టికల్‌గా సత్యలోకం అంటే ఏమిటో తెలుసుకుని, ఆ స్థితికి చేరుకోవడానికి భూమి మీద చేసే సాధన ఒక్క జన్మలోనే పూర్తవుతుందా? అందరికీ సాధ్యమవుతుందా? అంటే సాధ్యం కాదు, ఎన్నో జన్మలు పట్టవచ్చు. ఎన్ని జన్మలు పట్టినా విసుగు చెందకుండా, నిరంతరం సాధనలో కొనసాగాలి. “నేను ఇంతకాలంగా సాధన చేస్తున్నాను, ఎప్పుడు ఫలితం వస్తుంది?” అనే ఆలోచనతో ఎప్పటికీ నిరుత్సాహ పడకూడదు. మీరు ప్రయత్నిస్తూనే ఉండాలి, సాధన చేస్తూనే ఉండాలి. చూడండి, ప్రొద్దున్న భోజనం చేశారని మధ్యాహ్నం భోజనం చేయడం మానేస్తారా? మధ్యాహ్నం తిన్నారని రాత్రి భోజనం అవసరం లేదని అనుకుంటారా? ప్రతిరోజూ ఆకలి వేస్తుంది, ప్రతిరోజూ తింటారు, తినడంలో మీకు ఎప్పుడూ విసుగు రాదు.

మరి శరీరానికి ఆహారం ఇవ్వడంలో విసుగు రానప్పుడు, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి చేసే సాధనలో మాత్రం ఎందుకు విసుగు రావాలి? "ఎన్నేళ్ళుగా సాధన చేస్తున్నా నాకు ఏమీ రావడం లేదు" అని అనకూడదు. ఆత్మజ్ఞానం అనేది బయటికి కనిపించే ఫలితం కాదు, ఇది వెంటనే కనిపించే విజయమూ కాదు, ఇది తెర ముందు జరిగే భాగవతం కాదు. తెర వెనుక జరిగే అంతర్ముఖ పరివర్తన. మీ ఆలోచనలు ఎలా మారుతున్నాయి? మీ కోరికలు ఎలా తగ్గుతున్నాయి? మీ మాటలు, చేతలు, ప్రవర్తన ఎలా మారుతున్నాయి? మీరు ఇతరులతో ఎలా వ్యవహరిస్తున్నారు? అనేదే ముఖ్యం.

ఈ మానవ జన్మలో మూడు రకాలుగా మీ జీవన విధానం ఉంటుంది. 1) పశు జాతి మానవుడు,2) మానవజాతి మానవుడు, 3) దైవ మానవుడు.

1) పశుజాతి మానవుడు:

పశుజాతి మానవుడు ప్రక్కవాడిని పీడించైనా తన సుఖం తాను చూసుకుంటాడు. కొంతమంది తమ స్వార్థం కోసం ప్రక్కవాడికి నష్టం కలిగినా పెద్దగా బాధపడరు. వాళ్ళ హృదయం ఇంకా రాతి లాగా గట్టిగా ఉంటుంది. జాలి, కరుణ, దయ ఉండవు. వీళ్ళను రాక్షస జాతికి చెందిన వాళ్ళుగా అనొచ్చు, రాక్షస మనస్తత్వం ఉన్న వాళ్ళకు ఎదుటి వాళ్ళు ఏమైపోయినా, తన సుఖం, తన పేరు, ప్రఖ్యాతులు మాత్రమే ముఖ్యం. రాజకీయాల్లో ఎన్నికలను చూస్తే, తన పదవి నిలబెట్టుకోవడానికి ఎదుటివారిని నాశనం చేయడానికి కూడా వెనకాడని మనస్తత్వం కనిపిస్తుంది, అలాగే ఆస్తి వ్యవహారాల్లో కూడా తనకు అడ్డు వచ్చినవాడిని తొలగించాలనుకోవడం జరుగుతుంది. ఎదుటి మనిషిని హింసించి అయినా తన పదవి, పేరు, ప్రఖ్యాతులు నిలబెట్టుకోవాలి అనుకోవడం పశు మనస్తత్వం.

పశువులు ఏం చేస్తాయి? గడ్డి వేస్తే, ఒక దానిని ఇంకొకటి ప్రక్కకు తోసుకుంటూ ఉంటాయి. అంతే కదా! మరి మీరు కూడా మీ సుఖాల కోసం, మీ ఆనందాల కోసం ఎదుటి వాళ్ళను బాధ పెడితే, అది కూడా అదే మనస్తత్వం అవుతుంది. భార్యాభర్తల్లో కూడా కొంతమంది భర్తలు, "నా భార్య నేను చెప్పినట్టే వినాలి" అంటారు. కొంతమంది భార్యలు కూడా, " భర్త నేను చెప్పినట్టే వినాలి" అంటారు. అలాగే అత్తమామల విషయంలో, "ఇప్పుడు వీళ్ళు ముసలి వాళ్ళు అయ్యారు, గతంలో నన్ను సాధించారు, కాబట్టి ఇప్పుడు నేను రివేంజ్ తీర్చుకుంటాను" అనుకునే వాళ్ళు కూడా ఉంటారు, చుట్టూ చూస్తే మన ప్రపంచం ఇలాగే కనిపిస్తుంది.

వారు అజ్ఞానంలో జీవిస్తూ "నేను చేసిందే కరెక్టు, నాకు తెలిసినదే నిజం, వాళ్ళు నన్ను బాధపెట్టారు, నన్ను ఇబ్బంది పెట్టారు" అని అనుకుంటూ, జరిగిన ప్రతి విషయాన్నీ తమ కోణంలోనే చూస్తూ ఉంటారు. కానీ జ్ఞానం వచ్చినప్పుడు వాళ్ళ దృష్టి కోణమే మారిపోతుంది. జ్ఞానం ఉన్న చోట ప్రతీకారం ఉండదు. అందుకే కుటుంబాల్లోనే "వారిని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలి, వారికి కూడా మన కష్టం తెలియాలి" అని అనుకునే పరిస్థితులను మీరు చూస్తుంటారు. అప్పుడు "వాళ్లకు కొంచెం జ్ఞానం తెలిస్తే ఎంత బాగుండేది!" అని మీకు అనిపిస్తుంది. ఎవరైనా మిమ్మల్ని బాధపెట్టినా, కష్టపెట్టినా, జ్ఞానులు దాన్ని వేరే విధంగా చూస్తారు. "గత జన్మలో నేను ఏదో కర్మ చేసి ఉండవచ్చు. దాని ఫలితంగానే ఇప్పుడు వీరి ద్వారా నాకు ఈ అనుభవం వస్తోంది" అని భావించి, ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నించకుండా సైలెంట్‌గా ఉంటారు. కానీ జ్ఞానం లేని వారు మాత్రం "నన్ను తిట్టాడు కాబట్టి నేను కూడా తిట్టాలి, నన్ను కష్టపెట్టాడు కాబట్టి నేను కూడా కష్టపెట్టాలి, నాకు బాధ కలిగించాడు కాబట్టి అతనికి కూడా బాధ కలిగించాలి" అని అనుకుంటారు. ఇలా ఒకరి కోపానికి

మరొకరి కోపం తోడవుతూ, ఒకరి బాధకు మరొకరు బాధను జోడిస్తూ, కుటుంబాల్లోనే కక్షలు, ప్రతీకారాలు కొనసాగుతుంటాయి.

వయసులో ఉన్నప్పుడు ఎదురు చెప్ప లేకపోయినా, ఎదుటివారు వృద్ధాప్యంలోకి వెళ్ళినప్పుడు పాత విషయాలను గుర్తు చేసుకుని ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తారు. ఇలాంటి సంఘటనలు సమాజంలో, కుటుంబాల్లో జరుగుతూనే ఉంటాయి. కానీ జ్ఞానం వచ్చిన వ్యక్తి మాత్రం "ఎదుటివారు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?" అని మాత్రమే ఆలోచించడు. "ఈ పరిస్థితి ద్వారా నేను ఏమి నేర్చుకోవాలి? నా కర్మను నేను ఎలా అర్థం చేసుకోవాలి? నేను ఎలా స్పందించాలి?" అని తనను తాను ప్రశ్నించుకుంటాడు. అందుకే పత్రి గారు, "అందరూ జ్ఞానులు అయితే కృతయుగం ఇప్పుడే వచ్చినట్టు" అని చెప్పేవారు.

ఆయన అలా ఎందుకు అనే వారంటే, ప్రతి ఒక్కరూ జ్ఞానంతో జీవిస్తే ఒకరి మాటను మరొకరు అపార్థం చేసుకోరు, ఒకరి ప్రవర్తనను మరొకరు కక్షతో చూడరు, ప్రతీకారం అనే భావానికి చోటు ఉండదు. ఎవరు ఏది చేసినా దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకునే విశాలమైన దృష్టి వస్తుంది. జ్ఞానం పెరిగే కొద్దీ మనిషిలో కోపం తగ్గుతుంది, కక్ష తగ్గుతుంది, ప్రతీకారం తగ్గుతుంది, అవగాహన, సహనం, క్షమ, ప్రేమ పెరుగుతాయి. అలాంటి వ్యక్తులు ఎక్కువైతే కుటుంబంలో శాంతి ఏర్పడుతుంది, సమాజంలో శాంతి ఏర్పడుతుంది, చివరికి మనుషుల ఆలోచనా విధానమే మారుతుంది. అదే నిజమైన కృతయుగం.

చిన్నప్పటి నుంచి తనను ఎంతో ప్రేమగా పెంచిన పినతల్లి కైకేయి ఒక్కసారిగా, "రామా, నువ్వు అడవికి వెళ్ళాలి" అని చెప్పినప్పుడు, రాముడు "నువ్వెవరు నన్ను అడవికి పంపడానికి?" అని ఎదురు ప్రశ్నించలేదు. "నిన్నటి

వరకు నాన్నగారు నువ్వు చక్రవర్తి వని అన్నారు, తెల్లవారే సరికి పిలిచి అడవికి వెళ్ళమంటున్నారు. ఇంతటి మార్పు ఎందుకు జరిగింది? దీని వెనుక ఏదో దైవ నిర్ణయం ఉండి ఉండాలి" అని భావించి, ఆ ఆజ్ఞను శిరసావహించాడు. కైకేయి ఆ మాట చెప్పింది, దశరథుడు కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఆ పరిస్థితిని మార్చలేక పోయాడు. అయినా రాముడు ఆ మార్పును నిందగా తీసుకోలేదు, కైకేయిపై కోపం పెట్టుకోలేదు, తనకు అన్యాయం జరిగిందని భావించి ప్రతీకారం గురించి ఆలోచించలేదు. ఆ ఆజ్ఞను స్వీకరించి ప్రశాంతంగా అడవికి వెళ్ళిపోయాడు. లక్ష్మణుడికి కోపం వచ్చినప్పుడు అతడిని శాంతింప చేస్తూ, "ఇది దైవ నిర్ణయం, దైవం అనుకుంటే ఒక్క క్షణంలో పరిస్థితులను మార్చగలదు. మనకు అర్థం కానిదేదో ఇందులో ఉండవచ్చు, కాబట్టి ఈ పరిస్థితిని దైవ నిర్ణయంగా స్వీకరిద్దాం" అని చెప్పి ముందుకు సాగాడు రాముడు.

మరి ఆనాటి రాముడి మనస్తత్వం ఎటువంటిది? ఈనాటి మానవుల మనస్తత్వం ఎటువంటిది? ఈ రెండింటినీ ఒక్కసారి పోల్చి చూస్తే తేడా అర్థమవుతుంది. చక్రవర్తి కావాల్సిన రాముడు ఒక్కసారిగా అడవుల పాలయ్యాడు. అయినా ఆయన మనసులో అయోధ్యపై మమకారం లేదు, అడవిపై అసహనం లేదు. ఎందుకంటే యోగికి అడవి అయినా అయోధ్య అయినా ఒకటే. ఎక్కడ ఉన్నా తన సాధనను కొనసాగించగలడు, తన ధర్మాన్ని నిర్వర్తించగలడు, తన అంతరంగ శాంతిని కాపాడుకోగలడు. రాజ్యాన్ని పొందినా తన బాధ్యతను నిర్వహిస్తాడు, అడవిలో ఉన్నా యోగిగా జీవిస్తూ తన జీవితాన్ని సార్థకం చేసుకుంటాడు. రాజ్యం దొరికితే అది ఒక బాధ్యత, అడవిలో జీవించాల్సి వస్తే అది సాధనకు మరో అవకాశం. పరిస్థితి మారినా ఆయన మనసు మారదు. అందుకే ఆయనకు అయోధ్య అయినా ఒకటే, అడవి అయినా

ఒకటే. అంతటి సమత్వాన్ని కలిగి ఉన్న మహా యోగి రాముడు. ఆయనకు ఆ జ్ఞానం ఎక్కడి నుంచి వచ్చింది? ఆయన వశిష్ఠ మహర్షి వంటి మహా జ్ఞాని వద్ద శిష్యరికం పొందినవాడు కనుక. ఆయనకు సాధారణమైన ప్రాపంచిక జ్ఞానం మాత్రమే కాదు, జీవితం యొక్క అసలు సత్యాన్ని అర్థం చేసుకునే జ్ఞానం ఉంది. అందుకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే ప్రశాంతంగా ఉండటం కాదు, పరిస్థితులు పూర్తిగా ప్రతికూలంగా మారినప్పుడు కూడా ప్రశాంతంగా నిలబడగలిగాడు.

మరి మీరు కూడా నిజమైన జ్ఞానవంతులుగా ఎదిగినప్పుడు, చిన్న విషయాలకే కుంగిపోయే మూర్ఖత్వం నుంచి బయటపడతారు. నష్టం వచ్చినా, కష్టం వచ్చినా, అవమానం ఎదురైనా, పరిస్థితులు అనుకున్నట్టుగా లేకపోయినా వాటిని భరించే శక్తి మీలో పెరుగుతుంది. జ్ఞానం అంటే కష్టం రాకుండా చేసుకోవడం కాదు, కష్టం వచ్చినప్పుడు దాని వల్ల కూలిపోకుండా, దాన్ని అర్థం చేసుకుని, ధైర్యంగా ఎదుర్కొని, సమత్వంతో ముందుకు సాగ గలిగే శక్తిని పొందడం. అదే నిజమైన జ్ఞానం యొక్క లక్షణం.

పత్రి గారు మనకు "జ్ఞాన నవ రత్నాలు" లో ఒక గొప్ప మాట చెప్పారు, "సహనమే ప్రగతి." మీరు ఎంత సహనంతో ఉంటారో, ఎంత భరించగలరో, అంతగా మీలో ఆధ్యాత్మిక ఎదుగుదల జరుగుతుంది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కోపాన్ని, ఈర్ష్యను, ద్వేషాన్ని బయటకు ప్రదర్శించకుండా సహనంతో ఉండగలగడం సాధనలో ఎంతో ముఖ్యమైన విషయం. ఎందుకంటే మీరు సహించకుండా ప్రతిస్పందిస్తే, మీలోని కోపం, ద్వేషం ఆధారంగా మళ్ళీ కొత్త కర్మను సృష్టించుకుంటారు. కర్మ సిద్ధాంతం ప్రకారం, ఎవరైనా మిమ్మల్ని ద్వేషించడానికి లేదా బాధపెట్టడానికి ఏదో కారణం ఉండవచ్చు, గతంలో మీరు చేసిన కర్మకు ఫలితంగా ఇప్పుడు ఆ అనుభవం

మీకు ఎదురవుతూ ఉండవచ్చు.

ఈ విషయాన్ని సాధారణంగా అజ్ఞాని అర్థం చేసుకోవడం కష్టం, జ్ఞానంతో జీవించే యోగికి మాత్రం కర్మ యొక్క ఈ సూత్రం అర్థమవుతుంది. జ్ఞానం లేని వ్యక్తి "వాడు నన్ను తిట్టాడు, నన్ను బాధపెట్టాడు, కాబట్టి నేను కూడా వాడిని తిట్టాలి, బాధపెట్టాలి" అని అనుకుంటాడు. కానీ జ్ఞానం ఉన్న వ్యక్తి "ఎప్పుడో ఏదో కర్మ చేసి ఉంటాను; ఇప్పుడు దాని ఫలితాన్ని ఈ వ్యక్తి ద్వారా అనుభవిస్తున్నాను, ఇది ఇక్కడితో ముగిసిపోవాలి" అని భావిస్తాడు. అందుకే అతను తిరిగి ప్రతీకారం తీర్చుకోడు. మీరు మళ్ళీ అదే కోపంతో స్పందిస్తే, పాత కర్మను ముగించకుండా దానికి కొత్త కర్మను జోడించినట్టు అవుతుంది. ఆ కర్మను అనుభవించడానికి మళ్ళీ ఒక జన్మ అవసరం కావచ్చు. ఇలా కర్మకు కర్మను జోడించుకుంటూ పోతే జన్మల పరంపర కొనసాగుతూనే ఉంటుంది. అందుకే జ్ఞానం లేని మనిషి తన సుఖం కోసం, తన సంతోషం కోసం ఎదుటివారిని బాధపెట్టడానికి కూడా వెనుకాడడు.

ఇలాంటి మనస్తత్వం ఈ ప్రపంచంలో ఎన్నో రూపాల్లో కనిపిస్తూనే ఉంటుంది. ఇప్పుడు మీరు చూస్తే అనాథాశ్రమాలు ఎన్నో ఉన్నాయి, ఆసుపత్రులు ఎన్నో ఉన్నాయి, రోగాలు కూడా ఎన్నో రకాలుగా పెరుగుతున్నాయి. ఎందుకు ఇన్ని ఆసుపత్రులు అవసరమవుతున్నాయి? ఎందుకు ఇన్ని రకాల అనారోగ్యాలు వస్తున్నాయి? కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్నవారు "చేసిన కర్మకు తగిన ఫలితాన్ని అనుభవించాల్సిందే" అని చెబుతారు. అందుకే "రోగం పాపం, భోగం పుణ్యం" అని చెబుతారు.

మీరు ఇరవై అంతస్తుల అపార్ట్‌మెంట్ కట్టుకుని ఇరవయ్యవ అంతస్తులో నివసిస్తున్నంత మాత్రాన మీరు నిజమైన జమీందారు అయిపోరు. ఎన్ని అంతస్తుల ఇల్లు ఉంది, ఎంత ఆస్తి ఉంది, ఎంత డబ్బు ఉంది అనేది

నిజమైన సంపదకు కొలమానం కాదు. ఎలాంటి అనారోగ్యం లేకుండా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించ గలగడమే గొప్ప సంపద. అందుకే నిజమైన జమీందారు అంటే పెద్ద భవనంలో నివసించేవాడు కాదు, తన శరీరం ఆరోగ్యంగా ఉండి, తన మనసు ప్రశాంతంగా ఉండి, తన జీవితాన్ని సార్థకంగా జీవించ గలిగేవాడు.

మీరు చేసిన కర్మకు ఫలితం అనుభవించాల్సిందే. మానవ జన్మలో ఉన్నప్పుడు అజ్ఞానంతో పాప కర్మలు చేయవచ్చు, ఇతరులను బాధపెట్టవచ్చు, కోపం, ద్వేషం, ఈర్ష్యతో జీవించవచ్చు. కానీ ఆ కర్మల ఫలితాన్ని అనుభవించ కుండా వాటి నుంచి తప్పించుకోలేరు. వాటి ఫలితాలను అనుభవించడానికి మళ్ళీ జన్మ తీసుకోవాల్సి రావచ్చు. కాబట్టి జ్ఞానం ఉన్నవాడు కర్మను పెంచుకోడు, వచ్చిన కర్మను సహనంతో అనుభవించి, కొత్త కర్మను సృష్టించకుండా జాగ్రత్తగా జీవిస్తాడు. అదే నిజమైన సాధన, అదే ఆధ్యాత్మిక ప్రగతికి మార్గం.

కొంచెం కూడా జ్ఞానం లేని వ్యక్తి తన సుఖం, తన శరీర సుఖం, తన మనసుకు నచ్చినట్టుగా జీవించడం మాత్రమే చూసుకుంటాడు. అతను ఇతరులకు ఉపయోగపడడు, చివరికి తనకు తాను కూడా ఉపయోగపడలేని పరిస్థితిని తెచ్చుకుంటాడు. ఎందుకంటే అజ్ఞానంతో పాప కర్మలు చేసి, వాటి ఫలితంగా రోగాలు, కష్టాలు, బాధలు తెచ్చుకున్నప్పుడు తన జీవితాన్ని తానే సుఖంగా అనుభవించలేడు కదా? ఎలాంటి చీకూ చింతా లేకుండా, పెద్ద అనారోగ్యాలు లేకుండా, తిన్నది సరిగ్గా అరిగించుకుని, ప్రశాంతంగా నిద్రపోయి, ఆరోగ్యంగా జీవించ గలిగేవాడే నిజమైన కోటీశ్వరుడు. ఎన్ని కోట్లు సంపాదించినా కంటిమీద కునుకు లేకుండా, రోగాలతో బాధపడుతూ, మనశ్శాంతి లేకుండా జీవించేవాడు నిజంగా కోటీశ్వరుడేనా? డబ్బు, ఆస్తులు

లేకపోయినా హాయిగా తిని, తిన్నది అరిగించుకుని, ప్రశాంతంగా నిద్రపోయి, ఆరోగ్యంగా జీవించ గలిగేవాడినే అసలైన కోటీశ్వరుడు అని చెప్పవచ్చు.

మరి పశుజాతి మానవుడు అజ్ఞానంతో తన సుఖం కోసం పక్క వాళ్లను బాధపెడుతున్నప్పుడు, తాను చేస్తున్నది పాప కర్మ అని కూడా అతనికి తెలియదు. ఆ కర్మల ఫలితంగా కష్టాలు, బాధలు, రోగాలు ఎదురైనప్పుడు మాత్రం "దేవుడికి నా మీద దయ లేదు" అని అనుకుంటాడు. తన కర్మను అర్థం చేసుకోకుండా భగవంతుడిని నిందించడం కూడా అజ్ఞానమే. ఇవన్నీ ప్రధానంగా తమోగుణంతో కూడిన జీవన స్థితులు.

2) మానవజాతి మానవుడు:

మానవజాతి మానవుడు రెండో మెట్టులో ఉంటాడు. ఇక్కడ అతనిలో పుణ్యం చేయాలనే ఆలోచన మొదలవుతుంది. "ఇక్కడ దానం చేస్తే పుణ్యం వస్తుంది, ఈ గుడికి వెళ్తే నా కష్టం పోతుంది, అక్కడ అభిషేకం చేస్తే నా బాధ తొలగిపోతుంది" అనే ఆలోచనలు వస్తాయి. మీరు కూడా ఒకప్పుడు ఇలాంటి ఆలోచనలతో గుళ్ళచుట్టూ తిరిగిన వారే కదా! కొబ్బరికాయలు, పూజా సామగ్రి పట్టుకుని "ఏ గుడిలో మొక్కితే నా కష్టం పోతుంది? ఎక్కడ కొబ్బరికాయ కొడితే నా బాధ తొలగిపోతుంది? ఏ దేవుడికి ఏ పూజ చేస్తే నా కోరిక నెరవేరుతుంది?" అని వెతుకుతూ తిరుగుతారు. ఇది రజోగుణ స్థితి. గుళ్ళచుట్టూ తిరగడం,, పూజలు చేయడం, మొక్కులు చెల్లించడం ఇలా చేస్తూనే ఉంటారు. అయినా మీ జీవితంలో సంపూర్ణమైన శాంతి మాత్రం రాదు. కష్టాలు వస్తాయి. బాధలు వస్తాయి. కోరికలు పుడుతూనే వుంటాయి.

భగవంతుడు ఇచ్చిన డబ్బుతో మీరు గుడిని అభివృద్ధి చేయవచ్చు, ఎన్నో మంచి కార్యక్రమాలు జరిపించవచ్చు. కానీ కేవలం బయట చేసే పూజల వల్ల మీ అంతరంగంలోని అజ్ఞానం, మీ కర్మల ప్రభావం, మీలోని కోపం,

ద్వేషం, ఈర్ష్య, ఆశ, అహంకారం తొలగిపోవు. అందుకే ఇలా బయట తిరుగుతూ, తిరుగుతూ చివరికి భగవంతుడి అనుగ్రహంతో పత్రి గారి వంటి గురువు మీ జీవితంలోకి వస్తారు. గురువు వచ్చినప్పుడు భక్తికి ఒక కొత్త దిశ లభిస్తుంది, పూజ బయట నుంచి లోపలికి మళ్ళుతుంది, భక్తి సాధనగా మారుతుంది, సాధన జ్ఞానానికి దారి తీస్తుంది. భక్తి ఉన్నవారే నిజమైన ధ్యానంలో నిలబడగలరు, ఈ ధ్యాన మార్గంలో ఎవరు స్థిరంగా నిలబడగలరు అంటే, భగవంతుడిపై సంపూర్ణమైన భక్తి, విశ్వాసం, ప్రేమ ఉన్న వారే. అందుకే ఎంతో భక్తితో పూజలు చేసినవారు జ్ఞాన మార్గం గురించి వినగానే, గురువు చెప్పిన మాటలోని సత్యాన్ని వెంటనే గుర్తించి ధ్యాన మార్గంలో టక్కున అతుక్కుపోతారు.

భక్తి, విశ్వాసం లేని వారు మాత్రం వెంటనే స్వీకరించలేరు, “ఇది నిజమేనా? కాదా? ఇలా చేస్తే ఏం జరుగుతుంది?” అని సందేహిస్తూనే ఉంటారు. కానీ భక్తి లోతుగా ఉన్నప్పుడు గురువు చెప్పగానే మా రాఘవరావు గారిలా జ్ఞాన మార్గంలోకి వచ్చి పూర్తిగా మునిగిపోతారు. ఆయనకు వెంకటేశ్వర స్వామి అంటే భక్తి, శనివారం వస్తుందంటే నాకు నిద్ర పట్టదు. ఎందుకంటే ఆయన గుడిలో కూర్చోబెడతారు, మళ్ళీ అష్టోత్తరం అనుకుంటే సహస్రనామం అంటారు. ఈయనతో కూర్చుంటే నాకు మా పిల్లల స్కూల్స్, వాళ్ళటైమింగ్స్ అన్నీ గుర్తొస్తాయి. కానీ భక్తి పాట పెట్టి కళ్ళుమూసుకుని విన్నా సరే, టైం మాత్రం చూస్తాను, స్కూల్ టైం అయిపోతుందని. భక్తి ఎంత లోతుగా ఉంటే అంతగా మనసు భగవంతుడి వైపు మళ్ళుతుందో అర్థమవుతుంది. అయితే ఆ భక్తి చివరికి కేవలం పూజ దగ్గరే ఆగిపోకుండా, గురువు చూపించిన సాధనలోకి, ధ్యానంలోకి, ఆత్మ విచారణలోకి తీసుకెళ్ళినప్పుడే మానవ జన్మ యొక్క అసలైన ప్రయోజనం నెరవేరుతుంది.

రాఘవరావు గారు పత్రి గారిని కలిసిన వెంటనే పూర్తిగా ఆ మార్గానికి అతుక్కుపోయారు. ఆయనను చూసిన తర్వాత నాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది ఎవరైతే భగవంతుడిపై తీవ్రమైన భక్తి, విశ్వాసం కలిగి ఉంటారో, వారు ధ్యానం ఎంత కష్టం వచ్చినా వదిలిపెట్టరు. భక్తి ఎంత లోతుగా ఉంటే, సాధన కూడా అంత స్థిరంగా ఉంటుంది. మొదట్లో వారు భగవంతుడిని విగ్రహాలలో చూసి పూజించవచ్చు, కానీ ధ్యానంలోకి వచ్చి "ఆత్మే దైవం" అనే సత్యాన్ని తెలుసుకున్న తర్వాత వారి దృష్టి బయట ఉన్న దేవుడి నుంచి లోపల ఉన్న దైవత్వం వైపు మళ్ళుతుంది. ఆ తర్వాత ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని నష్టాలు ఎదురైనా, ఎన్ని పరిస్థితులు ప్రతికూలంగా మారినా వారు సాధనను వదులుకోరు. ఎందుకంటే వారి భక్తి కేవలం పూజలకే పరిమితం కాదు, భగవంతుడిపై భక్తి, గురువుపై విశ్వాసం, సత్యంపై ప్రేమతో పాటు మంచి గుణాలు కూడా క్రమంగా పెరుగుతాయి.

గురువు వచ్చిన తర్వాతే మీ జీవితంలో ఏది మంచి, ఏది చెడు, ఏది చేయాలి, ఏది చేయకూడదు అనే విషయాలపై నిజమైన విచారణ మొదలవుతుంది. ప్రతి మనిషిలోనూ మంచి, చెడు రెండూ ఉంటాయి. కానీ గురువు రాక ముందు భక్తి ఉన్నప్పటికీ, ఆ భక్తి సరైన జ్ఞానంగా, సరైన జీవన విధానంగా బయటపడకపోవచ్చు. మీరు భగవంతుడిని పూజిస్తూ ఉండవచ్చు, గుడికి వెళ్ళి గంటలు కొట్టవచ్చు, దక్షిణ సమర్పించవచ్చు, పూజలు చేయవచ్చు, ఇంకా ఏ పూజలు చేయాలో కూడా తెలుసుకోవచ్చు. కానీ "మీ జీవితం ఇలా ఉండాలి, ఇలా ఉండకూడదు, ఈ గుణాలను పెంచుకోవాలి, ఈ అలవాట్లను వదులుకోవాలి" అని మీ అంతరంగాన్ని మార్చే నిజమైన జ్ఞానాన్ని అందించే వారు చాలా అరుదు.

పూజారి తనకు తెలిసిన పూజా విధానాన్ని చెబుతారు, ఏ రోజు ఏ

పూజ చేయాలో చెబుతారు, కావాలంటే పూజల జాబితా కూడా ఇస్తారు, కానీ మీలోని కోపం, ద్వేషం, అహంకారం, అసూయ, దురలవాట్లు ఎలా తొలగించు కోవాలో, మీ జీవితం ఎలా మారాలో చెప్పలేదు. "ఇలా ఉండకూడదు, ఇలా ఉండవచ్చు, ఇది సత్యం, ఇది అసత్యం ఇది మీ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది, ఇది మిమ్మల్ని వెనక్కి లాగుతుంది" అనే నిజమైన జ్ఞానం గురువు వచ్చినప్పుడే మీకు స్పష్టంగా తెలుస్తుంది.

పత్రి గారు రాకముందు చాలామంది మాంసాహారం తీసుకునేవారు. ఏ గుడిలోని పూజారి అయినా "మాంసాహారం మానేయండి, జీవహింసను తగ్గించండి, మీ ఆహారం కూడా మీ మనసుపై ప్రభావం చూపుతుంది" అని జీవితాన్ని మార్చే విధంగా చెప్పలేదు? ఏదో ఒక పూజ రోజు పెద్దలు చెప్పారని ఆ రోజు మాత్రమే మానేవారు, మిగతా రోజుల్లో మళ్ళీ తినేవారు. భక్తి ఉన్నా, పూజలు చేసినా, జీవితంలో మార్పు మాత్రం రాలేదు. ఎందుకంటే "ఇది తప్పు, ఇది ఒప్పు, ఇది మిమ్మల్ని పైకి తీసుకెళ్తుంది, ఇది మిమ్మల్ని కిందికి లాగుతుంది" అని స్పష్టంగా బోధించేవారు లేకపోవడమే. తల్లిదండ్రులు కొన్ని విషయాలు చెప్తారు, గుడిలో పూజారి కొన్ని విషయాలు చెప్తారు, పాఠశాలలో ఉపాధ్యాయులు కొన్ని నీతి మాటలు చెప్తారు. చిన్నప్పుడు "అబద్ధం చెప్పకూడదు" అని మాస్టారు చెబుతారు, అంతవరకే పరిమితమవుతుంది.

కానీ సద్గురువు వచ్చినప్పుడు మాత్రం మీ జీవితాన్ని మీరు పరిశీలించుకునేలా చేస్తారు. "మీ దుఃఖానికి కారణం ఎప్పుడూ వేరెవరో కాదు, మీరు చేసుకున్న కర్మలు, మీరు పెంచుకున్న ఆలోచనలు, మీరు అలవాటు చేసుకున్న ప్రవర్తన కూడా మీ దుఃఖానికి కారణాలు కావచ్చు" అని చెబుతారు. ఇదే గురువు ఇచ్చే నిజమైన జ్ఞానం. బయట ప్రపంచాన్ని మార్చడం కాదు, ముందుగా మిమ్మల్ని మీరు మార్చుకోవడం నేర్పుతారు.

ఈ ఒక్క మాట చాలు. మీరు ఒక్కసారి నిజాయితీగా విచారణ చేసుకుంటే, “నా ఏడుపుకు అసలు కారణం ఎవరు?” అనే ప్రశ్నకు సమాధానం మీకే తెలుస్తుంది. ఎవరూ మిమ్మల్ని ఏడిపించలేదు, మీరు గతంలో చేసిన కర్మల ఫలితాలను వర్తమానంలో అనుభవిస్తున్నప్పుడు మీకు బాధ కలిగింది, ఆ బాధ వల్లే మీకు ఏడుపు వచ్చింది. మరి ఆ పాప కర్మలు ఎందుకు చేశారు? అప్పటివరకు మానవుడు అంటే మనసు చెప్పినట్టుగా జీవించేవాడు. తనకు నచ్చినది చేసేవాడు, తన కోరికల ప్రకారం నడిచేవాడు. ఎందుకంటే అతనిలో అజ్ఞానం ఉంది, అహంకారం ఉంది. అజ్ఞానం అంటే భగవంతుడు ఎవరో తెలియకపోవడం మాత్రమే కాదు, సత్యం కాని దాన్ని సత్యంగా భావించడం కూడా అజ్ఞానమే. ఆత్మే దైవం అయితే మీరు ఏం చేశారు? బయట ఉన్న విగ్రహాన్నే దైవంగా భావించారు.

కానీ గురువు వచ్చి, “మీరు బయట వెతుకుతున్న భగవంతుడు ఎక్కడో లేడు, మీలోనే ఆత్మగా ఉన్నాడు. బయట కనిపించేది ఒక ప్రతి రూపం మాత్రమే” అని చెప్పినప్పుడు మీలో నిజమైన అన్వేషణ మొదలవుతుంది, సాధన మొదలవుతుంది. అందుకే గురువు మొదట సాధన చేయమని చెబుతారు. ఎందుకంటే ఇంతకాలం ఎవరి మాటా వినని మనసు, సాధనలో క్రమంగా తన స్వభావాన్ని మార్చుకోవడం ప్రారంభిస్తుంది. మీరు ఇంతకాలం బాహ్యేంద్రియాలతో చేసిన పూజలు, స్తోత్రాలు, తీర్థ యాత్రలు, వ్రతాలు, ఇతర ఆచారాలు మీ ప్రాపంచిక జీవితానికి కొంత మేలు చేయవచ్చు, పుణ్య ఫలాలను ఇవ్వవచ్చు. కానీ అవి ఒక్కటే మీ మనసును పూర్తిగా మార్చలేవు. ఎందుకంటే బయట చేసే పనులు బాహ్య జీవితాన్ని ప్రభావితం చేస్తాయి, మీలోని ఆలోచనలు, కోరికలు, అహంకారం, భయం, ద్వేషం, అసూయ వంటి వాటిని మార్చడానికి అంతర్ముఖ సాధన అవసరం. ఇంద్రియాలకు

అతీతంగా మీలోనే ఒక శక్తి ఉంది, అదే ధ్యాన శక్తి.

మీరు ఆ శక్తిని అనుభవించగలిగినప్పుడు, మీ మనసు క్రమంగా శాంతిస్తుంది, ఆలోచనా విధానం మారుతుంది, మీ జీవన విధానం కూడా మారుతుంది. అందుకే గురువు ఏ సమస్య వచ్చినా "సాధన చేయి" అని చెబుతారు. ఎందుకంటే సమస్య బయట మొదలయ్యే ముందు మీ ఆలోచనలోనే మొదలవుతుంది. మీ ఆలోచనా విధానం తప్పుగా ఉన్నప్పుడు సమస్యలు పుడతాయి, ఆలోచన సరైన దిశలో ఉంటే అదే పరిస్థితిని మీరు మరో విధంగా స్వీకరించగలరు.

మ్యాథ్స్‌లో ఒక లెక్కకు వర్తించే సూత్రాన్ని కాకుండా వేరే సూత్రాన్ని ఉపయోగిస్తే సమాధానం తప్పు వస్తుంది. ఆ లెక్కకు ఏ సూత్రం వర్తిస్తుందో దానినే ఉపయోగించాలి. అలాగే మానవుడిగా పుట్టిన మీరు మానవ జన్మకు వర్తించే అసలు ధర్మాన్ని తెలుసుకుని జీవించాలి. మీరు ఏ ప్రయోజనం కోసం వచ్చారో తెలుసుకోకుండా వేరే దారిలో జీవిస్తే దుఃఖం తప్పదు. మీరు "నా భర్త కోసం, నా భార్య కోసం, నా పిల్లల కోసం, నా కుటుంబం కోసం, నా సంపద కోసం నేను ఈ భూమి మీదకు వచ్చాను" అని అనుకుంటారు. కానీ మీరు ఈ మానవ దేహాన్ని ఎందుకు పొందారు? మిమ్మల్ని సృష్టించిన ఆ పరమాత్మ ఎవరు? మీ అసలు స్వరూపం ఏమిటి? అనే సత్యాన్ని తెలుసుకోవడానికే ఈ మానవ జన్మ లభించింది. కానీ మీ చుట్టూ బంధాలు, బాధ్యతలు, ఆస్తులు, కోరికలు ఎక్కువైనప్పుడు భగవంతుడి జ్ఞాపకం తగ్గిపోతుంది. అదే బంధాల నుంచి కొంత దూరం ఏర్పడినప్పుడు మాత్రం దైవం వెంటనే గుర్తుకొస్తాడు.

అందుకే భగవంతుడు మీ పై కరుణతో, మీకు అతిగా అంటుకున్న బంధాలను ఒక్కొక్కటిగా సడలిస్తూ ఉంటాడు. బంధాల మీద మమకారంతో

భగవంతుడినే మర్చిపోయే స్థితికి మానవుడు వెళ్ళిపోతాడు. మీరు మీకు ఇష్టమైన వ్యక్తికి కష్టం వచ్చినప్పుడు “ఇంత కష్టం ఎందుకు వచ్చింది?” అని బాధపడతారు. కానీ ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే, ఆ అనుభవం మీలో వైరాగ్యాన్ని, విచారణను కలిగించే ఒక అవకాశంగా మారవచ్చు. మీరు సంపదల వల్ల అహంకారం పెంచుకుంటే, ఆ సంపద కూడా శాశ్వతంగా మీ దగ్గర ఉండదు. మీరు “నా పిల్లలు, నా పిల్లలు” అని వాళ్ళపై అతిగా మమకారం పెంచుకుంటే, ఒకరోజు వాళ్ళు ఉద్యోగం, వివాహం లేదా ఇతర కారణాలతో మీకు దూరంగా వెళ్ళాల్సి రావచ్చు. అప్పుడు “అయ్యో, పిల్లలు దూరమైపోయారు” అని బాధపడతారు.

ఆస్తిపాస్తులపై మమకారం పెంచుకుంటే అవి కూడా ఒకరోజు పిల్లల చేతుల్లోకి వెళ్ళిపోవచ్చు. కొన్నిసార్లు ప్రేమ ఎక్కువై, మీ స్థిర, చర ఆస్తులన్నీ పిల్లల పేర్లకు రాసి, మీరు కష్టపడి కట్టుకున్న ఇంట్లోనే మీకు స్వేచ్ఛ లేకుండా జీవించాల్సిన పరిస్థితి రావచ్చు. కోడలికి ఒక గది, మనవడికి ఒక గది, కొడుకుకి ఒక గది, మీకు ఒక గది అంటూ పెద్ద ఇల్లు కట్టుకున్నా, చివరికి అదే ఇంట్లో మీరు అతిథిలా అనిపించే పరిస్థితులు కూడా రావచ్చు. భోజనానికి పిలిస్తే వెళ్ళాలి, లేకపోతే మీ గదిలోనే ఉండాలి అనే స్థితి కూడా కొందరి జీవితాల్లో కనిపిస్తుంది.

ఇలాంటి జీవితాలను మన చుట్టూ చూస్తూనే ఉన్నాం. ఎంతో డబ్బు ఉందని పెద్ద పెద్ద భవనాలు కడతారు, పిల్లలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క కారు కొంటారు, వాళ్ళ సుఖం కోసం జీవితమంతా సంపాదిస్తారు. కానీ చివరికి మీకు అత్యవసరం వచ్చినప్పుడు మీ కోసం నిలబడే మనిషి లేకపోవచ్చు, మీ అవసరానికి అందుబాటులో ఉండాల్సిన కారు కూడా లేకపోవచ్చు. అప్పుడు అర్థమవుతుంది మీరు శాశ్వతం అనుకున్న బంధాలు, సంపదలు, ఆస్తులు

ఏవీ శాశ్వతం కావు. మీరు ఎందుకు ఈ భూమి మీదకు వచ్చారో మీకు తెలియకపోయినా, మిమ్మల్ని సృష్టించిన పరమాత్మకు మాత్రం తెలుసు. అందుకే ఏది మీకు అత్యంత ప్రియంగా మారి, దాని మీద మోజుతో భగవంతుడినే మర్చిపోయే స్థితికి తీసుకెళ్తుందో, అదే బంధం నుంచి మిమ్మల్ని బయటకు తీసుకురావడానికి జీవితంలో కొన్ని అనుభవాలను ఆయన కల్పిస్తాడు. అవి శిక్షలుగా కనిపించినా, ఆధ్యాత్మిక దృష్టిలో అవే మిమ్మల్ని బంధాల నుంచి విడిపించి, వైరాగ్యం వైపు, సాధన వైపు, చివరికి మీ అసలు స్వరూపాన్ని తెలుసుకునే దైవ మార్గం వైపు నడిపించే అవకాశాలుగా మారవచ్చు.

అన్నీ అయిపోయాక చివరికి మిగిలేది ఎవరు? దేవుడే దిక్కు. అప్పుడు "దేవుడా, దేవుడా" అంటూ భగవంతుడిని గుర్తు చేసుకుంటారు. ఒక్కసారి కూడా దేవుడిని తలుచుకోడానికి సమయం లేనంత బిజీగా జీవించిన మీరు, ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత మాత్రం "నేను ఆత్మను, నేను ఆత్మను, నేను ఆత్మను" అని ఎన్నిసార్లు స్మరిస్తున్నారు? మాయ తొలగిన కొద్దీ బంధాలపై ఉన్న మమకారం కూడా క్రమంగా తగ్గుతుంది. జీవుడు, దేవుడు వేరు వేరుగా కనిపించినా, ఇద్దరిలో ఉన్నది ఒకటే ఆత్మతత్వం. మరి జీవుడు ఎందుకు దుఃఖిస్తున్నాడు? దేవుడు ఎందుకు ఆనందంగా ఉన్నాడు? జీవుడు తన అసలు స్వరూపాన్ని మర్చిపోయాడు కాబట్టి. భార్య, భర్త, పిల్లలు, ఆస్తులు, బంధాలు, బాధ్యతలు, కోరికలు వీటిలో ఇరుక్కుపోయి "నేను దైవ స్వరూపుడిని" అనే సత్యాన్ని మర్చి పోయినందు వల్లే దుఃఖం మొదలైంది. "నేను దైవ స్వరూపుడిని" అనే జ్ఞానంలో నిలబడినప్పుడు బంధాలు మిమ్మల్ని బంధించలేవు.

దేవుడు ఎందుకు ప్రశాంతంగా ఉన్నాడు? "ఇది నాది, ఇది నాది" అనే స్వార్థ పూరిత భావన ఆయనకు లేదు, సృష్టి మొత్తాన్ని తన స్వరూపంగానే చూస్తాడు. కానీ మీకు ఆ సత్యం ఇంకా అనుభవంగా రాకపోవడంతో "దేవుడా,

ఇది ఇవ్వు, అది ఇవ్వు, నాకు అది కావాలి, నాకు ఇది కావాలి" అని అడుగుతూనే ఉంటారు.

3) దైవ మానవుడు:

మరి దైవ మానవుడిగా ఎదగడం ఎలా? ఒక్కసారి జ్ఞానం వచ్చినప్పుడు మీ జీవితం మారడం మొదలవుతుంది. తమోగుణంలో ఉన్న పశు జాతి మానవుడు తన సుఖం కోసం మాత్రమే జీవిస్తాడు, ఎవరికీ ఉపయోగపడడు. రజోగుణంలో ఉన్న మానవజాతి మానవుడు పాపపుణ్యాల చుట్టూ తిరుగుతూ, కోరికలు తీర్చుకోవడం కోసం కర్మలు చేస్తూనే ఉంటాడు. కానీ దివ్య మానవుడిగా ఎవరు ఎదుగుతారు? గురువు వచ్చినప్పుడు, గురువు ఇచ్చిన జ్ఞానాన్ని స్వీకరించి, దాన్ని సాధనలో పెట్టి జీవించిన వారే దివ్య మానవులుగా ఎదుగుతారు. ఈ సృష్టిలోని ప్రతి జీవి పరమాత్మ నుంచే ఉద్భవించింది, సకల జీవరాశుల లోనూ ఆత్మతత్వం ఒకటే అని మీరు తెలుసుకున్న తర్వాత, ముందుగా సాధన చేసి ఆ జ్ఞానాన్ని అనుభవంగా మార్చుకుంటారు.

అప్పుడు మీరు ఎవ్వరినీ హింసించరు, ఎవ్వరినీ ద్వేషించరు, ఎవరికీ హాని చేయాలనే ఆలోచన కూడా రాదు. మానవ జన్మ వచ్చిన తర్వాత దుఃఖం మొదలవుతుంది; అజ్ఞానం, అహంకారం, కోరికలతో పాప కర్మలు చేస్తూ పోతే ఆ దుఃఖం క్రమంగా పరాకాష్టకు చేరుతుంది. గురువు వచ్చిన తర్వాత ఏమవుతుంది? మీరు సాధనలోకి వస్తారు, సాధన ద్వారా సత్యాన్ని తెలుసు కుంటారు. ఏ సత్యాన్ని? "ఈ జన్మ ఎందుకు వచ్చింది? మానవ జన్మ యొక్క అసలు ప్రయోజనం ఏమిటి? నేను ఎవరు? నేను ఎందుకు ఈ భూమి మీదకు వచ్చాను?" అనే విషయాలను తెలుసుకుంటారు. ఈ సత్యం తెలిసే వరకు మానవుడి దుఃఖం పూర్తిగా తొలగదు. మీరు "నాకు ఏ బాధా లేదు" అని

అనుకున్నా, ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించవచ్చు, తల తిరిగి పడిపోవచ్చు, టెన్షన్ మొదలవుతుంది, బీపీ పెరిగిందా, షుగర్ పెరిగిందా, ఆసుపత్రికి వెళ్ళాలా అనే ఆలోచనలు మొదలవుతాయి.

మీరు నిజంగా దైవ స్వరూపాన్ని అనుభవిస్తే ఇంతటి భయం, టెన్షన్ ఎందుకు ఉంటుంది? మీరు మిమ్మల్ని శరీరంగా, జీవుడిగా మాత్రమే భావించుకుంటున్నారు కాబట్టే ఈ భయాలు వస్తున్నాయి. అంటే, మానవుడు తన అసలు సత్యాన్ని తెలుసుకునే వరకు దుఃఖం నుంచి పూర్తిగా బయట పడలేడు. ఆ సత్యాన్ని తెలుసుకున్న తర్వాత "ఆత్మే దైవం, ఆ ఆత్మ నా లోనే ఉంది, ఈ శరీరం శాశ్వతం కాదు, ఎప్పుడైనా విడిచి పోవచ్చు" అనే స్పష్టత వస్తుంది. అప్పుడు శరీరాని కంటే ఆత్మకు ప్రాధాన్యత ఇస్తూ, కర్మలు చేసినా కోరికల కోసం చేసే కామ్య కర్మలను కాకుండా, నిస్వార్థంగా చేసే యజ్ఞ కర్మలను ఆచరిస్తే మనిషిలో తేజస్సు, శక్తి, ప్రశాంతత పెరుగుతాయి.

అందుకే బ్రహ్మదేవుడు మానవులు దుఃఖం నుంచి బయటపడటానికి యజ్ఞ కర్మలు చేయాలని సూచించాడు. యజ్ఞ కర్మ అంటే కేవలం అగ్నిలో ఆహుతులు వేయడం మాత్రమే కాదు, లోక శ్రేయస్సు కోసం, ఇతరుల మేలు కోసం, స్వార్థం లేకుండా చేసే ప్రతి మంచి పని యజ్ఞ కర్మగా మారుతుంది. మీరు ఒక మంచి పని చేశారు, ఒక క్లాస్ ఏర్పాటు చేశారు, జ్ఞానాన్ని ఇతరులకు పంచారు అనుకోండి "భగవంతుడు నాకు ఈ పని చేసే అవకాశం ఇచ్చాడు, నా ద్వారా ఈ పని జరుగుతోంది" అని భావిస్తే అది యజ్ఞ కర్మ. కాని "నేనే క్లాస్ పెట్టాను, నేనే చెప్పాను, నా వల్లే ఇంతమంది వచ్చారు" అని అహంకరించుకుంటే అదే పని కామ్య కర్మగా మారుతుంది. అందుకే మీరు ఏ మంచి పని మీ మీదకు తీసుకోకూడదు. "నేను చెప్పాను కాబట్టి ఇంతమంది వచ్చారు, నేను చేశాను కాబట్టి ఇది జరిగింది" అని అనుకోకండి. భగవంతుడు

మీ ద్వారా చేయిస్తున్నాడు; మీకు ఒక అవకాశం ఇచ్చాడు, అంతే. "నేనే చేశాను" అనే భావం రావడం కూడా మాయకు లోబడటమే. దానికి బదులుగా "నా ద్వారా ఈ పని జరగడానికి భగవంతుడు అవకాశం ఇచ్చాడు" అనే భావంలో ఉండాలి. మీరు ఆ అవకాశాన్ని అహంకారంతో ఉపయోగించుకుంటే, భగవంతుడు ఆ అవకాశాన్ని మరొకరికి ఇవ్వవచ్చు.

అందుకే పరమాత్మ యజ్ఞ కర్మలను చేయమని చెప్పాడు. గీతలో వివిధ రకాల యజ్ఞాల గురించి చెప్పబడింది, వాటిలో ధ్యాన యజ్ఞం అత్యంత ఉన్నతమైనదిగా భావించబడుతుంది. ధ్యానం చేయడం, ధ్యానంలో ఇతరులను భాగస్వాములను చేయడం, జ్ఞానాన్ని పంచడం ఇవన్నీ పరమాత్మకు ఇష్టమైన కార్యాలే. మీరు ఇందులో పాల్గొన్నా గొప్పదే, చేయించినా గొప్పదే, ఇతరులను పాల్గొనేలా ప్రోత్సహించినా గొప్పదే. కానీ "నేను చేశాను కాబట్టి ఇది జరిగింది" అనే అహంకారాన్ని మాత్రం కామ్య కర్మగా మార్చుకోకూడదు. భగవంతుడి సందేశం ఒక్కటే యజ్ఞ కర్మలు చేయండి, కామ్యకర్మల బంధంలో చిక్కుకోకండి. కామ్యకర్మలు చేస్తే శక్తి క్రమంగా క్షీణిస్తుంది, నిస్వార్థ యజ్ఞ కర్మలు చేస్తే అంతర్గత శక్తి పెరుగుతుంది.

ఎవరైతే తమ ప్రతి పనినీ స్వార్థ రహితంగా యజ్ఞ కర్మగా మార్చుకుంటారో, వారే నిజమైన దివ్య మానవులుగా ఎదుగుతారు. పత్రి గారు దశాబ్దాల పాటు ఎంతో కృషి చేసి, ఎన్నో ప్రాంతాలకు తిరిగి, ధ్యాన సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళారు. తాను లేకపోయినా ధ్యానం అందరికీ చేరాలని భావించి అటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ధ్యానాన్ని అనేక ప్రాంతాలకు విస్తరింపజేశారు. అంటే పత్రి గారు చేసిన పని మొత్తం యజ్ఞ కర్మే. ఆయన తన స్వార్థం కోసం చేయలేదు, ప్రతి మనిషి బాగుండాలి, ప్రతి మనిషి తన అసలు స్వరూపాన్ని తెలుసుకోవాలి, "నేను ఎవరు? నేను ఈ

భూమి మీదకు ఎందుకు వచ్చాను?" అనే ప్రశ్నలకు సమాధానం పొందాలి, దాని కోసం ధ్యానం చేయాలి అనే ఉద్దేశంతో జీవించారు. అయితే తనకు మాత్రమే మోక్షం కావాలని కోరుకోవడం కాదు, తన ప్రక్కవాడు కూడా ఆత్మజ్ఞాన మార్గంలో నడిచేలా, మోక్షానికి అర్హత పొందేలా జ్ఞానాన్ని పంచగలిగినప్పుడే మనిషి తన జన్మను సార్థకం చేసుకున్నట్టవుతుంది.

అందుకే మీరు ఏ పని చేసినా భగవంతుడు మెచ్చుకునేది అందరికీ ఉపయోగపడే పని చేయడమే అదే యజ్ఞ కర్మ. "సర్వ జీవుల సేవే సర్వేశ్వరుని సేవ" అని అంటారు. భగవంతుడిని ఎక్కడ వెతుకుతారు? ప్రతి జీవిలోనూ ఆత్మగా ఉన్న పరమాత్మను గుర్తించినప్పుడు, సర్వ జీవుల సేవే భగవంతుని సేవగా మారుతుంది. మీరు ఇంకా మానవజాతి మానవుడి స్థితిలో ఉన్నా, దివ్య మానవుడిగా ఎదిగే అవకాశం మీకు సాధన ద్వారానే లభిస్తుంది. అందుకే నిరంతరం సాధన చేయాలి, పూర్ణజ్ఞానం పొందడానికి ప్రయత్నించాలి, ఆ జ్ఞానాన్ని మీ కోసం మాత్రమే దాచుకోకుండా ప్రక్కవాడి కన్నీళ్ళు తుడవడానికి ఉపయోగించాలి. ఎవరూ దుఃఖం లేకుండా లేరు, ఆ దుఃఖానికి ప్రధాన కారణాల్లో ఒకటి అజ్ఞానంతో చేస్తున్న కర్మలను తాము గుర్తించకపోవడం. ఉదాహరణకు, కొందరు మాంసాహారం తీసుకోవడం వల్ల జీవహింస జరుగుతుందని, అది తమ ఆధ్యాత్మిక జీవితంపై ప్రభావం చూపుతుందని తెలియక అలవాటుగా కొనసాగిస్తారు. తెలిసి తెలిసి మంటల్లో ఎవరు చేయి పెట్టరు, అలాగే ఒక పని తనకు, ఇతర జీవులకు హాని చేస్తుందని నిజంగా తెలిసినప్పుడు దాన్ని చేయకుండా ఉండే అవకాశం పెరుగుతుంది. మీరు చెప్పినంత మాత్రాన అందరూ వెంటనే వినకపోవచ్చు, అయినా మీకు తెలిసిన సత్యాన్ని ప్రేమతో చెప్పడం మీ బాధ్యత. కొందరు "అది ఒక్కటి లేకుండా ఉంటే ధ్యానం చేయవచ్చు" అని అనుకుంటారు, "మాంసాహారం తీసుకున్నా

పూజ చేశాం కదా, మాంసాహారం తీసుకున్నా ధ్యానం చేయొచ్చు కదా" అని తమకు తామే సమర్థించుకుంటారు.

కానీ అజ్ఞానంతో చేసే కర్మలు పేరుకుపోతే, మనిషి వాటి ఫలితాల నుంచి తప్పించుకోలేడు. సాటి జీవులను బాధపెట్టడం, హింసించడం, వాటి పట్ల కరుణ లేకపోవడం వంటి కర్మల ఫలితంగా మనిషి ఎన్నో కష్టాలను, బాధలను అనుభవించవచ్చు. అందుకే "జ్ఞానమే కర్మలను దహిస్తుంది" అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి. ఈ జన్మలో మీరు గొప్పవారిగా ఉండవచ్చు, "నేను మంచి వాడిని, కోటీశ్వరుడి ఇంట్లో పుట్టాను, ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను, ఎన్నో దానధర్మాలు చేశాను, అయినా నాకు ఇంత కష్టం ఎందుకు వచ్చింది? నాకు ఎంతో ఇష్టమైన దాన్ని ఎందుకు వదులుకోవాల్సి వచ్చింది?" అని అనుకోవచ్చు. అక్కడ కూడా "నేను ఎంతో గొప్పవాడిని, నేను ఎంతో ఎత్తులో ఉన్నాను" అనే అహంకారం దాగి ఉండవచ్చు. ఆ అహంకారం ఉన్నంతకాలం మనిషి తనకు ఇష్టమైన వాటిని పట్టుకుని వుంటాడు, జీవితంలో ఏదైనా కోల్పోయినప్పుడు మాత్రమే అది శాశ్వతం కాదని అర్థమవుతుంది.

కానీ ధ్యాన సాధన ద్వారా జ్ఞానం వచ్చిన తర్వాత, ఏదైనా నష్టం జరిగినా, ఏదైనా ఇష్టమైనది దూరమైనా, "నా కర్మలోని ఒక భాగం తొలగిపోయింది, ఈ అనుభవం ద్వారా నేను మరింత వైరాగ్యాన్ని, మరింత జ్ఞానాన్ని పొందాలి" అని స్వీకరించే శక్తి వస్తుంది. ఏ దేవుడూ మీ కర్మను తొలగించడు మీలో వెలిగే జ్ఞానమే కర్మబంధాన్ని దహించే శక్తిని ఇస్తుంది. అందుకే "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం" అనే గీతా వాక్యం చెబుతుంది. కొండంత కష్టం వచ్చినా దాన్ని భరించే శక్తి జ్ఞానికే ఉంటుంది. కృష్ణుడి జీవితాన్ని చూసినా, రాముడి జీవితాన్ని చూసినా కష్టాలు తప్పలేదు. కృష్ణుడు చిన్నప్పుడే తన తల్లిదండ్రుల నుంచి దూరమయ్యాడు, బాల్యంలోనే ఎన్నో ప్రమాదాలను

ఎదుర్కొన్నాడు, రాక్షసుల నుంచి తనను తాను రక్షించుకోవాల్సి వచ్చింది, తరువాత కూడా ఆయన జీవితంలో ఎన్నో సంఘర్షణలు, బాధ్యతలు, కష్టాలు వచ్చాయి. నారాయణుడి అంశంగా భావించబడిన కృష్ణుడి జీవితంలోనే కష్టాలు తప్పనప్పుడు, రాముడి జీవితంలో కూడా కష్టాలు తప్పనప్పుడు, ఇక సాధారణ మానవుడైన మీ జీవితంలో కష్టాలు రావడం అసాధారణం కాదు. పురాణాలు మనకు చెప్పే సత్యం ఏమిటంటే కర్మ ఎవ్వరినీ వదలదు. కృష్ణుడు అవతారంగా భూమి మీదకు వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసినా, తన జీవితంలో కర్మానుభవాల నుంచి పూర్తిగా తప్పించుకోలేదు.

అలాగే మీరు కూడా మీ కర్మలను అనుభవించడానికి ఈ భూమి మీదకు వచ్చారు. ఈ జన్మలో ఎన్ని కష్టాలు వచ్చినా, "ఎందుకు?" అని ప్రశ్నించడం కంటే, "ఈ అనుభవం ద్వారా నా కర్మ ఏమి తొలగించుకోవాలి? నేను ఏమి నేర్చుకోవాలి? నా సాధనను ఎలా మరింత లోతుగా చేసుకోవాలి?" అని ఆలోచించాలి. పత్రి గారు చెప్పినట్టుగా, "పెద్ద ఇష్టం, పెద్ద కష్టంతో భూమి మీదకు వస్తారు." యోగ జీవితం కూడా అంతే ఒక వైపు కర్మలను అనుభవిస్తూ, మరో వైపు సాధన చేస్తూ, జ్ఞానాన్ని పొందుతూ ముందుకు సాగాలి. కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా, దుఃఖాలు ఎదురైనా మీరు విసుగు చెందకుండా సాధనలో కొనసాగాలి. ఎందుకంటే మీ మానవ జన్మ యొక్క అసలైన ఉద్దేశం కేవలం సంపాదించడం, బంధాలను పెంచుకోవడం, సుఖాలను అనుభవించడం కాదు; "నేను ఎవరు?" అని తెలుసుకోవడం, మీలో ఉన్న ఆత్మే దైవమని అనుభవించడం, ఆ జ్ఞానంలో జీవించడం, ఆ జ్ఞానంతో ఇతరుల జీవితాల్లో వెలుగును నింపడం

ఇదే మానవ జన్మ యొక్క నిజమైన సార్థకత.

పిరమిడ్ మాస్టర్ల 18 ఆదర్శ సూత్రాలు

1. సరియైన ధ్యానం అంటే "ఆనాపానసతి" ధ్యానం చేయడం, అందరి చేతా చేయించడం.
2. సరియైన ఆధ్యాత్మిక పుస్తకాలను చదవడం; వాటినే అందరి చేతా చదివించడం.
3. ధ్యానానుభవాలనూ, పుస్తక జ్ఞానాన్నీ విధిగా అందరూ పరస్పరం పంచుకోవడం.
4. విధిగా పౌర్ణిమ ధ్యానం చేయడం ; అందరిచేతా పౌర్ణమి ధ్యానాన్ని చేయించడం.
5. వీలయినంత మౌనం పాటించడం.
6. వీలయినప్పుడల్లా పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం.
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి.
8. మాంసాహారం ససేమిరా తినకపోవడం! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమిత ఆహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ ఇవ్వడం.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణలో 'డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలు' అన్నది ఏ మాత్రం లేకపోవడం.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ సత్యఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. ఎవరి సమస్యలను వారే, తమ తమ స్వీయ ఆత్మశక్తిని ఉపయోగించి పరిష్కరించుకోవడం.
16. గృహస్థులుగా వుంటూనే, ఎవరి పనులు వారు చూసుకుంటూనే, జీవన్ముక్తిని సాధించడం.
17. అన్ని గ్రామాల లోనూ, అన్ని పట్టణాలలోనూ విధిగా పిరమిడ్ ధ్యానకేంద్రాలు నెలకొల్పడం.
18. పిరమిడ్ మాస్టర్లందరూ తమ తమ ధ్యానానుభవాలను గ్రంథరూపం చేసి విధిగా ప్రచురించాలి.

తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.

ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " రూ.70/-
51) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
52) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
53) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
54) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
55) కబీరు సందేశాలు-2 - రూ.60/-
56) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
57) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
58) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
59) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
60) అతీంద్రియ శక్తులు - రూ.60/-
61) ఆలోచించండి - రూ.60/-
62) నిర్వాణ మార్గం - రూ.60/-
63) ధ్యానులకు సూచనలు - రూ.60/-
64) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
65) మమకారం - రూ.60/-
66) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
67) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
68) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
69) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
70) సంకల్పమంటే? - రూ.50/-
71) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
72) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
73) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
74) అరిహంత్ - రూ.50/-
75) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
76) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
77) విదురుని సందేశాలు - రూ.40/-
78) మూడురకాల జీవితాలు - రూ.40/-
79) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
80) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
81) బ్రహ్మం అంటే? - రూ.40/-
82) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
83) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
84) మహాత్ముల సందేశాలు - రూ.40/-
85) సత్యం - రూ.40/-
86) చక్రాలు - రూ.40/-
87) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
88) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
89) మౌన ధ్యానం - రూ.40/-
90) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
91) శాకాహారమే మానవాహారం - రూ.15/-
92) అహింస మరియు శాఖాహారం - రూ.15/-

ఆత్మపై విశ్వాసం ఎందుకు ఉండాలి? ఎందుకంటే ఆత్మ అనేది పరమాత్మ స్వరూపం, అది అనంతమైన జ్ఞానం, అనంతమైన శక్తి, అనంతమైన ఆనందానికి మూలం అని ఎప్పుడైతే మీరు తెలుసుకుంటారో, అప్పుడే మీ ఆలోచనలు, మీ ప్రవర్తన, మీ జీవితం కూడా పూర్తిగా మారిపోతుంది. సత్యలోకాన్ని చేరుకోవడానికి ఈ భూమిపై ఉన్నప్పుడే ప్రయత్నం చేయాలి. "నేను ఈ జన్మలోనే సాధించగలను" అనే విశ్వాసం ఉంటేనే సాధించడానికి ప్రయత్నిస్తారు. అందుకే మొదట మీరు ఉంచుకోవాల్సింది ఆత్మపై విశ్వాసం. ఆత్మే భగవంతుడు అని విశ్వసించాలి. ఆత్మే భగవంతుడు అని తెలియని వారే నాస్తికులు, ఆత్మే భగవంతుడు అని తెలుసుకున్న వారే ఆస్తికులు. ఆస్తి అంటే ఉన్నది, ఉన్నదంతా ఆత్మే అని తెలుసుకోవడమే మానవుని కర్తవ్యం. అందుకే మీరు ఈ మార్గంలోకి వచ్చారు. ఈ విషయాలన్నీ తెలుసుకుంటూ, ఆచరిస్తూ ఉంటే ఇంకా ఇంకా ఉన్నత స్థితికి ఎదగగలుగుతారు.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మిగార్ల పుస్తకములు

వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు

ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

Telugu Books	English Books	Hindi Books	Kannada Books	Tamil Books